ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
గురువారం 17 అక్టోబరు 2024



ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు విద్యార్థుల ఎంపిక

ఎచ్చెర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి):అంబేడ్కర్ యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ప్రీ రిపబ్లిక్ డే పరేడ్‌కు ఎంపిక నిర్వహించారు. దీనికి వర్సిటీ అనుబంధ కళాశాలలకు చెందిన 125 మంది విద్యార్థులు హాజరయ్యారు. ఈ ప్రక్రియను వర్సిటీ వీసీ ప్రొఫెసర్ కేఆర్ రజని ప్రారంభించారు. అథ్లెటిక్స్, సాంస్కృతిక, కమ్యూనికేషన్ స్కిల్స్ విభాగాల్లో ఈ పోటీలను నిర్వహించారు. వర్సిటీ స్థాయిలో ఎంపికైన వారు జోనల్ స్థాయి పోటీల్లో పాల్గొనాల్సి ఉంటుంది. జోనల్ స్థాయి విజేతలకు న్యూ ఢిల్లీలో జరిగే రిపబ్లిక్ డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం దక్కుతుందని ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఎం.అనూరాధ తెలిపారు.

ఎమ్మెల్యేలను కలవాల్సిందే



- వారితో సమస్య లేకుండా చూసుకోవాలి మరి
- మద్యం వ్యాపారులకు అధికారుల హెచ్చరిక
- కొందరు ప్రజాప్రతినిధులు ప్రత్యక్షంగా జోక్యం
- తొలిరోజు సగమే తెరుచుకున్న వైన్ షాపులు

శ్రీకాకుళం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): 'వారు అధికారపార్టీ ఎమ్మెల్యేలు మరి. వారితో సమస్య లేకుండా కాస్త చూసుకోండి. లేకుంటే మేమేమీ చేయలేం. ఆతర్వాత మీ ఇష్టం'.. ఇలా మద్యం వ్యాపారులకు కొందరు అధికారులు అంతర్గతంగా హెచ్చరికలు జారీ చేస్తున్నారు. మద్యం దుకాణాలు విజయవంతంగా.. ఆరు ఫుల్లు.. మూడు ఆఫ్‌లుగా విక్రయాలు జరగాలంటే ఎలాంటి ఇబ్బంది లేకుండా వ్యాపారం జరగాల్సిఉంది. ప్రతి మండలంలో.. నియోజకవర్గంలో బాస్ ఎమ్మెల్యేనే. పైకి ఎమ్మెల్యే ప్రమేయం లేకున్నా.. చాన్నాళ్ల నుంచి వైన్ షాపుల నుంచి వచ్చే లాభంలో పార్టీలతో సంబంధం లేకుండా ఆ ఎమ్మెల్యేలకు కొంత వాటాను అప్పగిస్తుంటారు. ఇది అనధికారిక రూల్. ఇప్పుడు ప్రైవేటు మద్యం దుకాణాలు కావడంతో.. మరలా బెల్ట్ దుకాణాలు కొలువు తీరుతాయి. అలానే ఎమ్మార్పీ పెంచుకోవడం, ఆపై దుకాణాల్లో వాటర్ ప్యాకెట్లు, గ్లాసులు విక్రయాలు.. మందుబాబులు తాగేందుకు ఏర్పాట్లు చేపట్టడం వల్ల అదనపు ఆదాయం చేకూరుతుంది. ఇలా వచ్చిన లాభంలో ఎమ్మెల్యేలకు.. ఇతర కీలక ప్రజాప్రతినిధులకు పంపకం చేయాల్సిందే. దీనిపై ఎక్సైజ్ అధికారుల్లో చర్చ జరిగినట్లు సమాచారం. ప్రతి నియోజకవర్గంలో ఎక్కడా ఇబ్బందులు తలెత్తకుండా.. పైఅధికారులకు ఫిర్యాదు అందకుండా.. రెండేళ్లపాటు వివాదాలు లేకుండా సాఫీగా వ్యాపారం జరగాలంటే ముందుగా నియోజకవర్గ ఎమ్మెల్యేను వెళ్లి కలవాలని.. వారి ఆశీస్సులు ఉన్నాయన్న నమ్మకాన్ని కల్పించుకోవాలని వ్యాపారులకు వారు సూచించినట్లు సమాచారం. ఇప్పటికే సిండికేట్ అయి మద్యం దుకాణాలను దక్కించుకున్న వాళ్లందరూ రాజకీయ పార్టీల ప్రధాన అనుచరులే. ఇటు ఎక్సైజ్ అధికారులకు వ్యాపారులే భరోసా ఇస్తూ ఎమ్మెల్యేల నుంచి.. ఎటువంటి సమస్యా ఉండదని.. అవన్నీ తాము చూసుకుంటామని జాగ్రత్తలు చెబుతున్నారు. ప్రజాప్రతినిధులతో మద్యం వ్యాపారం కోసం ఇబ్బంది కలుగకుండా ఆ బాధ్యతలు ముందుగానే సరిదిద్దుకోవాల్సిందేనంటూ అనధికారిక హెచ్చరికలను అధికారులు జారీచేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

జోక్యం చేసుకుంటున్న ప్రజాప్రతినిధులు

లాటరీల ద్వారా మద్యం దుకాణాలను చేజిక్కించుకున్నవారిలో రాజకీయ పార్టీల అనుచరులే ఉన్నారు. జిల్లాలో వైసీపీకి చెందినవారే దుకాణాలు ఎక్కువగా దక్కించుకున్నారు. అలాగే టీడీపీ ఎమ్మెల్యేల కుటుంబ సభ్యులు.. అలాగే వారి అనుచరులు, సన్నిహితులు.. బడాబాబులు సిండికేట్ అయి మద్యం దుకాణాల్లో ప్రత్యక్షంగాను.. పరోక్షంగాను కలుగుజేసుకున్నారు. ఇప్పుడు దుకాణాలు కొలువుతీరాయి. దీంతో ప్రత్యక్షంగాను కలుగుజేసుకుని.. ప్రతినెలా వచ్చిన లాభంలో ఎవరెవరికి ఎంత శాతం... గుడ్‌విల్ పేరిట దుకాణాలు కొనుగోలు చేసుకున్నవాటికి ముందుగానే చెల్లింపులు.. అలాగే వైన్‌షాపుల సమీపంలో ఉండే మరోవైన్‌షాపులను కూడా గుడ్‌విల్ పేరిట కొనుగోలు చేసుకుని.. డబ్బులు చెల్లించుకునేలా ప్రజాప్రతినిధులు పరోక్షంగా తలమునకలయ్యారు. నియోజకవర్గంలో ఇద్దరు ఎమ్మెల్యేలు ప్రత్యక్షంగానే ఇందులో తలదూర్చారు. రెండు మాసాల అనంతరం మద్యం వ్యాపారంలో ఉన్న అసలు బాగోతం బయటపడనుందని ప్రజలనుంచి విమర్శలు వినిపిస్తున్నాయి.

తొలి రోజు సగమే..

కూటమి ప్రభుత్వం తీసుకువచ్చిన ప్రైవేటు మద్యం విధానం బుధవారం నుంచి అమల్లోకి వచ్చేసింది. శ్రీకాకుళం జిల్లాలో 158 మద్యం దుకాణాలు ఉండగా.. ఇవన్నీ ప్రైవేటు పరమయ్యాయి. అయితే తొలిరోజున పూర్తిస్థాయిలో దుకాణాలు తెరుచుకునేందుకు వీలుపడలేదు. కేవలం సగానికి పైగా దుకాణాలు తెరుచుకున్నాయి. పూర్తిస్థాయిలో మద్యం సీసాలను దుకాణాలకు పంపే యంత్రాంగం సిద్ధం లేకపోవడం.. ఆపై రవాణా ఇవన్నీ ప్రస్తుతానికి సరిగ్గా కుదరక తొలిరోజున సగం వైన్ షాపులే తెరుచుకున్నాయి.

నేటి నుంచి పూర్తిస్థాయిలో మద్యం

అన్ని మద్యం దుకాణాల్లో ఐదేళ్ల కొలువుతీరిన 'జే' బ్రాండ్లు అదృశ్యమయ్యాయి. ఇప్పటికే ఎంసీ విస్కీ, ఇంపీరియల్ బ్లూ వంటి బ్రాండ్లు అందుబాటులోకి వచ్చేశాయి. ఈ వారం రోజుల్లో పూర్తిస్థాయిలో అన్ని రకాల బ్రాండ్ల మద్యం దుకాణాల్లో అందుబాటులోకి తీసుకురానున్నారు. గురువారం ఉదయం నాటికి మిగిలిన సగం దుకాణాలకు సరుకులు పూర్తిస్థాయిలో సరఫరా చేయనున్నారు. అలాగే ఇప్పటికే సిండికేట్ సభ్యులందరూ ప్రభుత్వానికి చెల్లించాల్సిన ట్యాక్స్‌ను సగం చెల్లించేశారు. రాత కోతలు పూర్తయ్యాయి.

మొదటి రోజే మద్యం దుకాణాలు బంద్

- చాలాచోట్ల తెరచుకోని షాపులు
- ఒడిశాకు క్యూ కట్టిన మందుబాబులు

మెళియాపుట్టి/కొత్తూరు/నందిగాం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నూతన పాలసీలో భాగంగా జిల్లాలో బుధవారం ప్రైవేట్ మద్యం దుకాణాలు ప్రారంభంకావాల్సి ఉంది. అయితే, తొలిరోజే చాలాచోట్ల మద్యం దుకాణాలు బంద్ అయ్యాయి. బుధవారమే మద్యం షాపులు తెరవాలని ఎక్సైజ్ అధికారులు చెప్పినా కొంతమంది డిపాజిట్లు చెల్లించకపోవడం, మద్యం డెలివరీ కాకపోవడంతో మెళియాపుట్టి, కొత్తూరు, నందిగాం తదితర మండలాల్లో మద్యం అమ్మకాలు ప్రారంభం కాలేదు. నూతన పాలసీలో భాగంగా ప్రధాన రహదారికి 220 మీటర్ల దూరంలో మద్యం షాప్ ఏర్పాటు చేయాలనే నిబంధన ఉండడంతో యజమానులు దుకాణాల వేటలో పడ్డారు. కొందరు దుకాణాలను అద్దెకు తీసుకొని పూజా కార్యక్రమం చేసినప్పటికీ మద్యం రాకపోవడంతో అమ్మకాలు ప్రారంభంకాలేదు. దీంతో మద్యంప్రియులు షాపుల వైపు పదేపదే చక్కర్లు కొట్టారు. కొత్తూరు వంటి మండలాల్లో కొందరు మందుబాబులు పక్క రాష్ట్రమైన ఒడిశాకు తరలివెళ్లారు.

మందు కోసం బారులు

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నరసన్నపేట పట్టణం పల్లిపేట జంక్షన్ వద్ద బుధవారం రాత్రి 7గంటలకు ప్రైవేట్ మద్యం దుకాణాన్ని ప్రారంభించారు. క్వార్టర్ రూ.99కే దొరుకుతుందనే ప్రచారంతో మందుబాబులు బారులు తీరారు. షాపు వద్ద గలాట జరగకుండా ఎక్సైజ్‌శాఖ అధికారులు బందోబస్తు నిర్వహించారు. గురువారం నాటికి నరసన్నపేట పట్టణంలో ఎనిమిది మద్యం షాపులు ప్రారంభమవుతాయని ఎక్సైజ్‌శాఖ ఎస్ఐ గురుమూర్తి తెలిపారు.



నరసన్నపేట: పల్లిపేట జంక్షన్ వద్ద మద్యం కోసం బారులు తీసిన మందుబాబులు



తనను కాపాడమని పోలీసులను వేడుకుంటున్న సురేష్

పట్టపగలే వెంబడించి.. చంపేందుకు యత్నించి..

- శ్రీకాకుళం నగరంలో కొందరు దుండగుల దారుణం
- ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేశాడన్న ఉద్దేశంతో..
- కారు అద్దాలు పగలగొట్టి.. కాలువలో పడేసిన వైనం
- ఎమ్మెల్యే కూన అనుచరులే చేశారంటున్న బాధితుడు

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇసుక అక్రమాలపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేశాడన్న వ్యక్తిపై కొందరు వ్యక్తులు దాడి చేసిన ఘటన శ్రీకాకుళం నగర వాసులను హడలెత్తించింది. బాధితుడు, స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గత ఎన్నికల్లో ఆమదాలవలస స్వతంత్ర్య ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయిన సనపల సురేష్‌పై బుధవారం సుమారు 30 మంది మూకుమ్మడిగా దాడి చేసి కారు అద్దాలు బద్దలు కొట్టి, దాడికి పాల్పడ్డారు. మంగళవారం దూసి, రాగోలు ప్రాంతాల్లో అక్రమంగా ఇసుక నిల్వలు చేసి తరలిస్తున్నారని సనపల సురేష్ జేసీకి ఫిర్యాదు చేశారు. జేసీ ఆదేశాల మేరకు తహసీల్దార్ ఇసుక అక్రమ నిల్వలను సీజ్ చేశారు. ఇసుక అక్రమాలపై ఫిర్యాదు చేసిన సనపల సురేష్ బుధవారం తన కారులో చీమలవలసకు చెందిన సనపల చంద్రతో కలిసి రాగోలు జెమ్స్ వద్దకు చేరుకున్నాడు. అక్కడ మీడియా ప్రతినిధులకు జరిగిన విషయాన్ని వివరిస్తుండగా అలమాజీపేటకు చెందిన అశోక్, పురుషోత్తపురం సాయి సహా 30 మంది దాకా అక్కడకు వచ్చి దాడికి యత్నించారు. ఇది గమనించిన సురేష్ తన కారులో అక్కడి నుంచి తప్పించుకునేందుకు యత్నించాడు. ఈ క్రమంలో కారు వెనుక ఉన్న కొంత మందిని గుద్దుకుంటూ తన ప్రాణాలు కాపాడుకునే ప్రయత్నం చేశాడు. కారులో రూరల్ పోలీసు స్టేషన్‌కు వెళ్దామనుకున్న సురేష్‌ను.. అప్పటికే అశోక్, సాయి అడ్డగించడంతో శ్రీకాకుళంలోని ఎస్పీని కలిసేందుకు నగరంలోకి కారు మళ్లించాడు. అయితే బలగ సమీపంలో సురేష్ తన కారుకు అడ్డంగా బైక్ పెట్టడంతో తప్పించుకునే ప్రయత్నం చేయగా కొంతమంది వ్యక్తులు వచ్చి కారు అద్దాలు బద్దలు కొట్టి దాడి చేశారు. సురేష్ మళ్లీ తప్పించుకుని కాంప్లెక్స్ సమీపంలోకి రాగానే దుండగులు వచ్చి కారులో ఉన్న సురేష్‌ను బయటకు లాగి పక్కనే ఉన్న కాలువలో పడేసి దాడి చేశారు. అక్కడే ఉన్న కానిస్టేబుల్ గోవిందరావు సురేష్‌ను కాపాడి రెండో పట్టణ పోలీసు స్టేషన్‌కు తీసుకుని వెళ్లాడు. పోలీసులు సురేష్‌ను రిమ్స్‌కు తరలించి చికిత్స చేయిస్తున్నారు.

కూన రవికుమార్, అశోక్, చంద్రతో ప్రాణహాని

ఇసుక అక్రమాలపై జగన్ రెడ్డి ప్రభుత్వ హయాం నుంచి పోరాడుతున్నానని, ప్రభుత్వం మారిన తరువాత కూన రవికుమార్ ఇసుక ఆగడాలను అడ్డుకుంటున్నాని, దీంతో అతనికి రూ.50లక్షలు నష్టం రావడంతో తనను చంపించే ప్రయత్న చేస్తున్నారని సురేష్ ఆరోపించారు. తాను టీడీపీ కుటుంబ సభ్యుడినని, తనతో పాటు తన తండ్రి, తాత కూడా టీడీపీ సభ్యులమేనని, అయినా తనపై కూన రవికుమార్ హత్యాప్రయత్నం చేస్తున్నాడని సనపల సురేష్ ఆరోపించారు. సెప్టెంబరు 27న తనపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టి దాడి చేసేందుకు యత్నించారని, అప్పుడు తప్పించుకున్నానని తెలిపారు. తనపై జరుగుతున్న దాడులు, హత్యాయత్నంపై కలెక్టర్‌తో పాటు ఎస్పీకి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదన్నారు.

పాడిరైతులకు విశాఖ డెయిరీ ఝలక్

- ఒక లీటరు ఆవుపాలకు రూ.2.30 తగ్గింపు
- రైతులకు జిల్లాలో ఒకరోజుకు రూ.3.22 లక్షలు నష్టం

టెక్కలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పాడిరైతులకు విశాఖ డెయిరీ ఝలక్ ఇచ్చింది. ప్రస్తుతం ఇస్తున్న ఆవుపాల ధరకు లీటరుకు 2 రూపాయల 30పైసలు తగ్గించింది. దీంతో విశాఖ డెయిరీకి పాలు ఇస్తున్న రైతుల్లో ఆందోళన నెలకొంది. జిల్లాలో ఇచ్ఛాపురం, కంచిలి, హరిపురం, టెక్కలి, పాతపట్నం, సారవకోట, నరసన్నపేట, గార, శ్రీకాకుళం, పైడిభీమవరం, బుడుమూరు, సరుబుజ్జిలి, కొత్తూరు తదితర ప్రాంతాల్లో విశాఖ డెయిర్ బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లు ఉన్నాయి. ఇందుకు సంబంధించి ఆయా మండలాల్లో క్షేత్రస్థాయిలో పాలసేకరణ ఏజెంట్ల ద్వారా రోజూ ఉదయం 8గంటల లోపు, సాయంత్రం 8గంటల లోపు పాలను సేకరిస్తుంటారు. అయితే జిల్లాలో రోజుకు సుమారు లక్షా40వేల లీటర్ల పాలు సేకరణ చేస్తుండగా, ఇందులో అధికశాతం ఆవుపాలే. క్షేత్రస్థాయిలో ఏజెంట్ల వద్ద సేకరించిన పాలను క్యాన్లతో సమీపంలోని బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్లకు పంపించడం, ఆవుపాలల్లో వెన్నశాతం బాగుంటే లీటరుకు 42 రూపాయల మేరకు, గేదెపాలు లీటరుకు 82 రూపాయల వరకు పాడిరైతులకు విశాఖ డెయిరీ చెల్లిస్తుంటుంది. ప్రస్తుతం విశాఖ డెయిరీలో తయారవుతున్న పాలపౌడర్‌లో రూ.20కోట్లు వరకు నష్టం వాటిల్లుతోందన్న కారణం చూపి ఆవుపాలు ఇచ్చే రైతులకు తగ్గించారు. ఈమేరకు మండలస్థాయిలోని మిల్క్ కూలింగ్‌సెంటర్ల మేనేజర్లకు విశాఖ డెయిరీ సమాచారం అందించింది. అయితే జిల్లాలో విశాఖ డెయిరీ ఆధ్వర్యంలో సేకరిస్తున్న లక్షా40వేల లీటర్ల పాలకు సంబంధించి వందలాదిమంది పాడిరైతులకు రూ.3లక్షల22వేలు ఒక రోజుకు నష్టం వాటిల్లుతుంది. జిల్లాలో విశాఖ డెయిరీకి ప్రత్యామ్నాయంగా హెరిటేజ్ సంస్థ రోజుకు సుమారు 35 వేల లీటర్ల పాలను సేకరిస్తోంది. ఈ పరిస్థితుల్లో విశాఖ డెయిరీని నమ్ముకున్న పాడిరైతులు ఇక హెరిటేజ్‌కు క్యూ కట్టే పరిస్థితి ఉంది. పాల ధర తగ్గింపు అంశమై విశాఖ డెయిరీ ఉద్యోగులకు సంప్రదించేందుకు ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా సమాచారం ఇచ్చేందుకు దోబూచులాడారు. చివరకు టెక్కలి విశాఖ డెయిరీ మేనేజర్ శ్రీరామ్మూర్తి మాట్లాడుతూ ఒక లీటరు ఆవుపాలపై రూ.2.30 తగ్గనుందని, గేదెపాలకు లీటరుకు రూ.3 పెరగనుందని, ఇది డెయిరీ మేనేజ్‌మెంట్ తీసుకున్న నిర్ణయమని తెలిపారు.



టెక్కలిలో బల్క్‌మిల్క్ కూలింగ్ సెంటర్

గెరమ్మా.. చల్లంగా చూడమ్మా! 6
- నేడు గౌరీ పౌర్ణమి..

కోమాలో టెక్కలి ట్రామాకేర్
- 45మంది సిబ్బందికి ప్రస్తుతం ఐదుగురే
- నేడు వరల్డ్ ట్రామాడే 6

ఏడాదిలోపు భావనపాడు పోర్టు నిర్మాణం పూర్తి
- రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం 6



ఒంటరి మహిళలే టార్గెట్

- ఇట్టే బైక్‌లో వచ్చి మెడలో గొలుసులు లాక్కెళ్తారు
- అంతర్రాష్ట్ర ముఠా సభ్యుడిని పట్టుకున్న పోలీసులు
- ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబర్ 16(ఆంధ్రజ్యోతి): ఒంటరిగా వెళ్తున్న మహిళలే వారి టార్గెట్. బైక్‌లో వారిని అనుసరించి మెడలో బంగారు గొలుసులు లాక్కెళ్లడం వీరిపని. ఇతర రాష్ట్రాల్లో ఇలాంటి ఎన్నో ఘటనలకు పాల్పడినా.. జిల్లాలో తొలిసారి చేతివాటం ప్రదర్శించిన అంతర్రాష్ట్ర ముఠాలో ఒకరు పోలీసులకు దొరికి పోయాడు. జిల్లా పోలీసు కార్యాలయంలో బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఈ వివరాలను విలేకరులకు వెల్లడించారు. జిల్లాలోని కాశీబుగ్గ సబ్ డివిజన్ పరిధిలో ఈ నెల 1వ తేదీన వజ్రపుకొత్తూరు, కాశీబుగ్గ, బారువ, కంచిలి ప్రాంతాల్లో ఒకే రోజు నలుగురు వ్యక్తులు చైన్ స్నాచింగ్‌కు పాల్పడ్డారు. వీరిలో ప్రధాన నిందితుడు ఒడిశా రాష్ట్రం జైపూర్ జిల్లా ముండమల్ గ్రామానికి చెందిన చిన్మయ ప్రధాన్. పోలీసులు ఇతడ్ని పట్టుకుని ఆరున్నర తులాల బంగారు ఆభరణాలు, బైక్ స్వాధీనం చేసుకున్నారు. కంచిలి మండలం మకరాంపురం జంక్షన్ సమీపంలో సుజలా వాటర్ ప్రాజెక్టు వద్ద స్కూటీపై వెళ్తున్న ఇద్దరు మహిళల్లో వెనుక కూర్చున్న మహిళ మెడలో బంగారు పుస్తెల తాడును నిందితులు చిన్మయి ప్రధాన్, బిజయ్ ప్రధాన్‌లు లాక్కెళ్లారు. అదేరోజు బారువ మండలం కొర్లాం గ్రామ సమీపంలో ఓ మహిళ మెడలో పుస్తెల తాడును, అదే రోజు వజ్రపు కొత్తూరు మండలం బెండిగేటు సమీపంలో ఓ మహిళ మెడలో బంగారు గొలుసును తెంచుకుని పారిపోయారు. ఈ చోరీలకు పాల్పడిన వెంటనే వారి వెనుక వస్తున్న సంతోష్ ప్రధాన్ సంజయ్ ప్రధాన్‌కు దొంగిలించిన బంగారు వస్తువులను ఇచ్చేసి వారి నుంచి దుస్తులు తీసుకుని మార్చుకున్నారు. ఆ తరువాత బంగారు వస్తువులు జాడుపూడి కోలనీ జంక్షన్ దగ్గరిలో బోలా శంకర్ దాబా వెనుక ప్రధాన నిందితుడు చిన్మయి ప్రధాన్ ఒక్కడే వెళ్లి గొయ్యి తీసి దాచిపెట్టాడు. ఈ నెల 15న దాచిపెట్టిన బంగారు ఆభరణాలను తీసుకెళ్లేందుకు వచ్చిన చిన్మయి ప్రధాన్ తిరిగి వెళ్తుండగా కంచిలి పోలీసులకు పట్టుబడ్డారు. చిన్మయి ప్రధాన్

- మిగతా 6వ పేజీలో..

'బీర పువ్వే దేవతామూర్తి

- ఆశ్వీయిజ మాసంలో పూజించే ఆచారం
- పెళ్లి కావాలనే కోరికతో ప్రత్యేక పూజలు
- ఒడిశా ఆచారాలను పాటిస్తున్న ఉద్దానం ప్రజలు

కంచిలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పెళ్లికాని యువతులు తమకు త్వరలోనే కల్యాణం కావాలని, మంచి వరుడిని పొందాలని బీర పువ్వును పూజిస్తారు. ప్రతి ఏటా ఆశ్వీయిజ మాసం మొదలుకుని కార్తీక పౌర్ణమి వరకు దీన్ని ఆచరిస్తారు. ఈ ప్రత్యేకత ప్రత్యేకత ఇటీవల ఉద్దానం ప్రాంతంలో ఉంది. ఇది ఒడిశాకు ఆనుకుని ఉండటం, అక్కడి వారు ఇక్కడ స్థిర నివాసాలు ఏర్పాటు చేసుకోవడం, ఒడియా మాట్లాడేవారంతా ప్రత్యేక గ్రామాలుగా ఏర్పడటం వంటి కారణాల వల్ల.. అక్కడి ఆచార, సాంప్రదాయాలతోపాటు ప్రత్యేక పూజా పద్ధతులు ఉద్దానం ప్రాంతంలో దర్శనమిస్తున్నాయి. ప్రతీఏటా విజయ దశమి అనంతరం వచ్చే పౌర్ణమి రోజుల్లో ఆంధ్రా ప్రాంతంలోని రైతులు, రైతు కూలీలు గౌరీ పౌర్ణమి పూజలు చేయడం పరిపాటి. అయితే ఆశ్వయుజ మాసం ప్రారంభమైనప్పటి నుంచి ఉద్దానంలో అత్యధిక శాతం ఒరియా మాట్లాడే ప్రజలు ఉన్న కంచిలి మండలంలోని కొక్కిలిపుట్టుగ, కొన్నాయిపుట్టుగ, తలతంపర, ప్రధానపుట్టుగతోపాటు కవిటి మండలంలోని పలు గ్రామాల్లో బీర పువ్వును దేవాతామూర్తిగా భావిస్తూ పూజిస్తారు. పెళ్లి కాని యువతులు ఒక దివ్వె (వెడల్పాటి మట్టి పాత్ర)లో ఇసుక, మట్టిని వేసి చిరు ధాన్యాలు వేసి, ఇంటి ముందర ఉన్న తులసి కోట వద్ద ఉంచుతారు. ప్రతిరోజు ఆ పాత్రలో నీరు వేసి, పూజలు చేస్తారు. పౌర్ణమి నాటికి ఆ పాత్రలో వేసిన చిరు ధాన్యాల నుంచి మొలకలు వస్తే ఆ యువతులకు త్వరలోనే పెళ్లి జరుగుతుందని వారి నమ్మకం. ఆ పాత్ర ఉంచిన చోటే బీర పువ్వును ఉంచి దేవతా మూర్తిగా కొలుస్తారు. కార్తీక పౌర్ణమి

- మిగతా 6వ పేజీలో..



ప్రధానపుట్టుగలో తులసి కోట



కొక్కిలిపుట్టుగలో పూజలు చేస్తున్న మహిళలు

గౌరమ్మా.. చల్లంగా చూడమ్మా!



జమ్ములో నందెన్న ఊరేగింపు

- ●నేడు గౌరీ పౌర్ణమి.. గ్రామాల్లో వైభవంగా మంగళగౌరీ పూజలు
- ●నందెన్న ఉత్సవాలు ప్రారంభం.. పత్రికొమ్మల ఉత్సవాలు కూడా..

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గ్రామీణప్రాంతాల్లో అత్యంత వైభవంగా జరుపుకునే పండుగ గౌరీపున్నమి (పౌర్ణమి). రైతులు.. ఆ కుటుంబాల్లోని మహిళలు భక్తి శ్రద్ధలతో ఈ వేడుకులను నిర్వహించుకుంటారు. మంగళగౌరీవ్రతం చేస్తే ముత్తయిదవులు తమ మాంగళ్య బలం చేకూరుతుందని, పెళ్లికాని యువత ఈ వ్రతం నిర్వహిస్తే వివాహాలు జరుగుతాయనే విశ్వాసం ఉంది. ఎప్పటి నుంచో వస్తున్న ఈ సంప్రదాయాన్ని గ్రామీణ మహిళలు.. పాటలు, ఆటలు, పాటలు, పూలతో జరుపుకుంటారు.

గౌరీ పున్నమి ఇలా..

మంగళ గౌరి వ్రతం చేసే మహిళలు ముందురోజు రాత్రి గోరింటాకు చేతినిండా పూసుకుంటారు. పున్నమి రోజును ఉదయాన్నే కాలువ, చెరువు లేదా నదిలో తలంటు స్నానాలు చేస్తారు. ఆరోంతా ఉపవాస దీక్షతో ఉంటారు. ఇళ్లు, వాకిళ్లు శుభ్రం చేసి ఆవుపేడతో ఇంటి బయట కల్లాపు చల్లి.. వరి పిండితో అందగా ముగ్గులు వేస్తారు. మధ్యాహ్నం 3 గంటలకు కాలువలు లేదా నదికి వెళ్లి స్నాన్నాలు చేసి.. పొలంలో ఉన్న వరిదుబ్బు (గౌరీదేవి ప్రతిరూపంగా) కుడ్డును పళ్లెం వేసి తలపై ఇంటికి తీసుకువస్తారు. తెలంగాణలో బతుకమ్మ మాదిరిగా.. వరికును పుసుపు, కుంకుమ, పూలతో అలంకరణ చేస్తారు. ఇంటి బయట ముగ్గులతో అలంకరణ చేసిన ప్రాంతంలో పీటమీద అలంకరణ చేసిన గౌరిదేవినీ ఉంచుతారు. చెరుకు, వడపప్పుతో పాటు పిండివంటలు నైవేద్యంగా పెట్టి మంగళగౌరి వ్రతం చేస్తారు.

ఆట పాటలతో పూజలు

పూజలు చేసిన తరువాత మహిళలు గౌరిదేవిచుట్టూ తిరుగుతూ ఆట పాటలతో కొలుస్తారు. సిక్కోలు జానపదాలు పాడుతూ మంగళహారతులను సమర్పిస్తారు. అనంతరం ఉలాలు వేసి.. గౌరీదేవి పాటలు పాడుతూ శివపార్వతులను కీర్తిస్తారు. మాంగళ్యబలం పెరగాలని.. పొలాల్లో పంటలు సంవృద్ధిగా పండాలని కొలుస్తారు. అలాగే రైతులు కూడా కొన్ని గ్రామాల్లో పున్నమి నాడు అమ్మవారి ఆలయాలు ముందు పత్రి కొమ్ములు వేసి మొక్కులు చెల్లించి వాటిని పొలాల్లో నాటుతారు. ఈ కొమ్మల ద్వారా పంటలకు చీడలు, తెగుళ్ల ఆశించవని రైతుల విశ్వాసం.

నందెన్న సంబరాలు

జిల్లాలోని కొన్ని గ్రామాల్లో నందెన్న సంబరాలకు పున్నమి రోజున అంకర్పారణ చేస్తారు. ఈ రోజు మొదలు కార్తీకమాస శుద్ధ చవితి వరకు 21 రోజులు పాటు నిర్వహించడం తరతరాలుగా వస్తున్న ఆచారం. శివుని వాహనం అయిన నందిని మట్టితో తయారు చేసి.. వాటిపై శివపార్వతులు విగ్రహాలు ఏర్పాటు చేసి పున్నమి రోజున ఊరేగిస్తారు. ఆ సమయంలో.. మా ఇంటి ముందు దించండి అంటూ పోటీ పడి మంచాలను వేసి ఇళ్ల ముందు కొలుస్తారు. ఆ ఇంటి మహిళ కొంత దూరం వరకు నందెన్నను తలపై పెట్టుకుని అలా మరో ఇంటి మంచం వరకు ముందుకు సాగుతూ.. గ్రామం అంతా ఊరేగింపు నిర్వహిస్తారు. ఈ ఉత్సవాల్లో మంగళవాయిద్యాలు, కోయడ్యాన్సులులో నిర్వహిస్తారు. గజిబిజి జీవితాలు ప్రారంభం కావడంతో ఇటీవల నందెన్న ఉత్సవాలు ఐదు రోజులు, ఏడు రోజులు, తొమ్మిది రోజులకే కొన్ని గ్రామాల్లో ముగిస్తున్నారు. అప్పట్లో గౌరీపున్నమి తరువాత కార్తీక చవితి వరకు పొలాల్లో వరి పక్వానికి వచ్చి.. కోత వచ్చేదశ.. కాబట్టి రైతులకు పనులు ఉండేవి కావు. అందుకే ఆ రోజుల్లో నాగుల చవితి వరకు ఈ ఉత్సవాలు నిర్వహించేవారని పెద్దలు చెబుతున్నారు.

నందెన్నలు సిద్ధం

జలుమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలుగ్రామాల్లో గౌరీ ఉత్సవాలు గురువారం నుంచి ప్రారంభంకానున్నాయి. దీనికోసం నందెన్న విగ్రహాలను సిద్ధం చేశారు. కోయి డాన్సులు, సాము గరిడీలతో పార్వతీ పరమేశ్వరుల గ్రామోత్సవం నిర్వహించేందుకు భక్తులు ఏర్పాట్లు చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో సందడి వాతావరణం నెలకొంది.



జలుమూరులో గౌరీ ఉత్సవాలకు సిద్ధం చేసిన నందెన్నలు

సందడిగా గౌరమ్మ సంబరాలు

ఎచ్చెర్ల, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తపేట, ఫరీద్‌పేట, బొంతలకోడూరు, కేశవరావుపేట తదితర గ్రామాల్లో గౌరమ్మ సంబరాలు బుధవారం ప్రారంభమయ్యాయి. పాడి పంటలు అభివృద్ధి చెందాలని, పిల్లాపాపలతో సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ ఐదో రోజుల పాటు గౌరీ నందీశ్వరులను పూజించను న్నారు. అనంతరం నిమజ్జనంతో ఈ ఉత్సవం ముగియనుంది.



కొత్తపేటలో గౌరమ్మను మొక్కుతున్న భక్తులు

పున్నమి నాడు ఆ సందడే వేరు



మా చిన్నతనంలో గౌరి పున్నమి వచ్చిందంటే ఆ సందడే వేరు. గ్రామాల్లో మహిళలు అంతా కలిసి ఆరోజు కలిసి కాలువల్లో స్నాన్నాలు వెళ్లి.. గౌరీదేవిని పొలం నుంచి తీసుకువచ్చి.. అలంకరణ చేసేవాళ్లం. సాయంత్రం చందమామ కనిపించిన తరువాత గౌరీపూజలను ఆరంభించి.. రాత్రి 11 గంటల వరకు అలుపు లేకుండా పాటలు పాడుతూ కొలిచేవాళ్లం.

-రెడ్డి చిన్నమ్ముడు, జమ్ము

పాతటెక్కలిలో రాజకీయ కక్షలు

- ● టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణ
- ● ఐదుగురికి గాయాలు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమరం ముగిసి నాలుగు నెలలు గడుస్తున్నా మండలంలోని పాతటెక్కలిలో ఇంకా ఎన్నికల వేడి తగ్గడం లేదు. గ్రామంలో ఎక్కడో చోట రాజకీయ తగదాలు జరుగుతున్నాయి. మంగళవారం రాత్రి టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య కొట్లాట చోటు చేసుకోవడంతో ఇరువర్గాలకు చెందిన ఐదుగురు గాయపడ్డారు. గ్రామస్థులు, ప్రత్యక్ష సాక్షులు అందించిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన ముగడ గిరి అనే వ్యక్తి గతంలో వైసీపీ సానుభూతి పరుడిగా ఉండేవాడు. స్థానిక నాయకులు తీరు నచ్చక సార్వత్రిక ఎన్నికలకు ముందు టీడీపీలో చేరి చురుకుగా పని చేశాడు. ఇది నచ్చని తన సామాజిక వర్గానికి చెందిన వైసీపీ కార్యకర్తలు గిరి ఎప్పుడు కలసినా కవ్వింపు చర్యలకు దిగేవారు. దీంతో తరచూ ఇరువర్గాల మధ్య వాదోపవాదాలు జరుగుతుండేవి. మంగళవారం రాత్రి గిరి తండ్రి గంగయ్య అమ్మవారి గుడి నుంచి పత్రి కొమ్మలు తీసుకువస్తుండగా దారిలో వైసీపీకి చెందిన కొంతమంది వ్యక్తులు ఆయన్ను అడ్డుకున్నారు. 'నీ కొడుకు టీడీపీలోకి వెళ్లి ఏమి సాధించాడని' రెచ్చగొట్టే ధోరణిలో మాట్లాడారు. దీనికి గంగయ్య సైతం ధీటుగా బదులు ఇవ్వగా అక్కడే ఉన్న వైసీపీ సానుభూతి పరుడు ముద్దాడ దానయ్య.. గంగయ్య ముఖంపై పిడిగుద్దులు కురిపించడంతో ముందు పళ్లు ఊడిపోయాయి. విషయం తెలుసుకున్న గంగయ్య కుమారుడు గిరి, భార్య మోరియమ్మ అక్కడికి చేరుకున్నారు. దీంతో ఇరువర్గాల మధ్య కొట్లాట చోటుచేసుకుంది. ఈ ఘటనలో గంగయ్య, గిరి, మోరియమ్మకు గాయాలయ్యాయి. గంగయ్య పారతో తనపై దాడి చేయడంతో తలకు తీవ్ర గాయమైందని వైసీపీకి చెందిన దానయ్య చెబుతున్నాడు. మరో మహిళకు స్వల్పగాయాలయ్యాయి. ఇరువర్గాలకు చెందిన క్షతగాత్రులు పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నట్లు ఎస్ఐ నిహాల్ తెలిపారు. కాగా, వీరంతా ఒకే సామాజిక వర్గంతో పాటు బంధువులు కావడం విశేషం.



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న టీడీపీ మద్దతుదారులు గంగయ్య, గిరి, మోరియమ్మ, గాయపడిన వైసీపీ కార్యకర్త దానయ్య

ఏడాదిలోపు భావనపాడు పోర్టు నిర్మాణం

- ●రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం

టెక్కలి, ఆగస్టు 16(ఆంధ్రజ్యోతి): భావనపాడు (మూలపేట) గ్రీన్ ఫీల్డ్ పోర్టు నిర్మాణం ఏడాదిలోగా పూర్తిచేస్తామని బుధవారం మంత్రివర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. దీంతో కూటమి ప్రభుత్వ పనితీరుపై హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. వైసీపీ ప్రభుత్వం పోర్టు పనులకు సంబంధించి ఏప్రిల్ 19, 2023లో అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ పోర్టు నిర్మాణానికి సంబంధించి శ్రీ విశ్వసముద్ర సంస్థ రూ.4361.91 కోట్లతో టెండర్లు దక్కించుకుంది. ఈ పోర్టు నిర్మాణం 2026 నాటికి పూర్తిస్థాయిలో జరిగితే నాలుగు బెర్త్‌లకు గాను రెండు బెర్త్‌లు జనరల్(కార్గో), ఒక బెర్త్ బొగ్గుకు, ఇంకో బెర్త్ కంటైనర్లకు ప్రతిపాదనలు చేశారు. అందులో భాగంగా 10.6 కిలోమీటర్ల రైలుమార్గం అవసరమని, 13.8 కిలోమీటర్ల రోడ్డు మార్గం అవసరమని, పోర్టు నిర్మాణానికి 826.51 ఎకరాల భూమి అవసరమని అధికారులు గుర్తించారు. అయితే అప్పటి వైసీపీ ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియ పూర్తికాకుండానే జగన్‌మోహన్‌రెడ్డి శంకుస్థాపన చేయించారు. 293.97ఎకరాల సాల్టు భూముల సమస్య ఇప్పటికీ కొలిక్కిరాలేదు. చెన్నైకి చెందిన సాల్ట్ కమిషనర్ జిల్లా కలెక్టర్‌తో పలుమార్లు ఉప్పు భూముల సమస్యపై కూర్చున్నా రేటు తేలకపోవడంతో ఇప్పటికీ అది ఓ కొలిక్కి రాలేదు. పోర్టు రైలు మార్గానికి సంబంధించి పోతునాయుడుపేట, యామాలపేట, రాజపురం, కాశీపురం, కోటపాడు, కూర్మన్నపేట గ్రామాలకు చెందిన 142 మంది రైతులకు సంబంధించి 72 ఎకరాల భూమి అవార్డు స్టేజ్‌లోనే మగ్గుతోంది. ఇక మూలపేట, విష్ణుచక్రం గ్రామాలకు సంబంధించి సుమారు 40మంది లబ్ధిదారులకు పీడీఎఫ్‌లు సైతం అందని పరిస్థితి నెలకొంది. ఇక పోర్టు పనులకు సంబంధించి నార్త్‌బ్రేక్ గట్టు 271 మీటర్లు పూర్తిచేయగా సౌత్‌బ్రేక్ గట్టు 1,940 మీటర్లకు గాను అసంపూర్తిగా నిలిచిపోయింది. సౌత్‌బ్రేక్ గట్టుపై వేసిన ఇసుక ఇటీవల కాలంలో ఏర్పడిన తుఫాన్‌కు కొట్టుకుపోయింది. ఇక పోర్టు పరిధిలో 15.85 మిలియన్ క్యూబిక్‌మీటర్ల డ్రెజ్జింగ్ పనులు జరగాల్సి ఉన్నప్పటికీ ఆ స్థాయిలో జరగలేదు. అప్పట్లో వైసీపీ ప్రజాప్రతినిధులు ఈ డ్రెజ్జింగ్ పనులు జరుగుతున్నపుడు ఫొటోల ఫోజులు ఇచ్చారు. 2024 జూన్4 నాటికి కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటికీ విశ్వసముద్ర సంస్థ చేపట్టిన పనులు మినహా ఇటీవల ఏ పనులూ జరగలేదు. టెక్కలి నియోజకవర్గ ఎమ్మెల్యేగా ఎన్నికైన కింజరాపు అచ్చెన్నాయుడు జూన్ 4న పోర్టు పనులు ఆపివేయాలని ప్రకటించగా ఈ నాటి వరకు అవి మూలకు చేరాయి. అయితే ఇటీవల మంత్రి అచ్చెన్నాయుడు మూలపేటలో జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫార్మన్ అహ్మద్ ఖాన్‌లతో కలిసి సమావేశం ఏర్పాటుచేసి పోర్టు పనులకు శ్రీకారం చుడతామని చెప్పడం, దరి మిలా ముఖ్యమంత్రి చంద్రబాబు క్యాబినెట్ సమావేశం అనంతరం ఈ పనులు ఏడాదిలోగా పూర్తిచేస్తామని ప్రకటించడంపై హర్షాతిరేకాలు వ్యక్తం అవుతున్నాయి.



పోర్టు పనులు జరుగుతున్న దృశ్యం

పంచాయితీలో కత్తితో దాడి

- ●యువకుడికి తీవ్రగాయాలు
- ●పాతగొడవలే కారణం

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కొద్ది రోజుల క్రితం ఇద్దరు యువకుల మధ్య చోటు చేసుకున్న వివాదం.. కత్తితో దాడి చేసే పరిస్థితికి దారితీసింది. బాధితుడు, దాడికి పాల్పడిన వ్యక్తి, పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. నగరంలోని దమ్మల వీధికి చెందిన తోట దుర్గా ప్రసాద్ అనే యువకుడు, అదే వీధికి చెందిన అతడి స్నేహితుడు పుక్కళ్ల రాము అలియాస్ సతీష్ ఈ నెల 13వ తేదీన రూరల్ మండలం కుందువానిపేట బీచ్‌కు వెళ్లారు. అక్కడ రాము, ప్రసాద్ మధ్య వివాదం చోటుచేసుకుంది. దీంతో ప్రసాద్‌పై రాము దాడి చేశాడు. ఈ విషయం కాస్తా ప్రసాద్ తల్లిదండ్రులకు తెలియడంతో దమ్మల వీధిలో మరోసారి వీరిద్దరి మధ్య గొడవ చోటుచేసుకుంది. దీంతో వీధి పెద్దలు బుధవారం దమ్మల వీధిలో ఉన్న ఆంజనేయ స్వామి కోవెలలో ఇరువర్గాల మధ్య రాజీ కుదిర్చేందుకు పంచాయితీ పెట్టారు. అయితే వీధి పెద్దలు మాట్లాడుతుండగానే దుర్గాప్రసాద్ ఒక్కసారిగా తన జేబులో ఉన్న మడతపెట్టే కత్తిని తీసి రాముపై దాడి చేశాడు. ఈ దాడిలో రాము ఎడమ మెడపై గాయం కాగా అతడిని హుటాహుటిన రిమ్స్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే దాడి చేసిన కత్తి చిన్నది కావడంతో ప్రాణాపాయం తప్పింది. ప్రస్తుతం రాము ఆరోగ్యం బాగానే ఉందని వైద్యులు చెబుతున్నారు. బాధితుడు అవుట్ పోస్టు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఒన్‌టౌన్ ఎస్ఐ హరికృష్ణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇదిలా ఉండగా దాడికి దిగిన ప్రసాద్ రాము నుంచి.. తనకు ప్రాణ హాని ఉందని, తరుచూ తనపై దాడికి పాల్పడుతున్నాడని, ఇప్పటికే రెండు సార్లు దాడి చేశాడని, పెద్ద మనుషుల సమక్షంలో కూడా బెదిరించడంతోనే ఈ దాడి చేశానని ఒన్‌టౌన్ పోలీసులకు వివరించాడు.



రిమ్స్‌లో చికిత్స పొందుతున్న రాము

నాడు-నేడు ఇక.. మనబడి-మన భవిష్యత్

- ● పేరుమార్చిన రాష్ట్ర ప్రభుత్వం

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో విద్యార్థులకు మౌలిక వసతులను కల్పించేందుకు గత ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు పథకం పేరును కూటమి ప్రభుత్వం మార్పు చేసింది. మనబడి-మనభవిష్యత్‌గా మార్పు చేస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు బ్యాంకు ఖాతాల్లో కూడా మార్చాలంటూ పాఠశాల విద్యాకమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీలకు ఇటీవల ఎన్నికల నిర్వహించి నూతన పాలకవర్గాలను ఎన్నుకున్నారు. మనబడి నాడు-నేడు జాయింట్ చెక్ హోల్డర్‌గా ఉన్న ఎస్ఎంసీ సభ్యులు ఉండేవారు. వీరి స్థానంలో కొత్తగా ఎన్నికైన వారు జాయింట్ చెక్ హోల్డర్‌గా బ్యాంకు ఖాతాల్లో పేర్లు మార్పు చేయాలని ఉత్తర్వులు వెలువడ్డాయి. ఈమేరకు జిల్లా విద్యాశాఖ అధికారులకు ఆదేశాలు కూడా జారీ అయ్యాయి. హెచ్‌ఎంలు బ్యాంకు ఖాతాల్లో ఈ మార్పులను వెంటనే చేయాలని పేర్కొన్నారు.

కోమాలో టెక్కలి ట్రామాకేర్

- ● 45మంది సిబ్బందికి ప్రస్తుతం ఐదుగురే ●నేడు వరల్డ్ ట్రామాడే

టెక్కలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారులపై ప్రమాదాలు జరిగితే క్షతగాత్రులను హుటాహుటిన దగ్గరలోని ఆసుపత్రికి తరలించి ప్రాణాలు కాపాడేందుకు 1999లో అప్పటి కేంద్ర ప్రభుత్వం ట్రామాకేర్ సెంటర్లను ఏర్పాటు చేసింది. అందులో భాగంగా అప్పటి టెక్కలి ఎమ్మెల్యే హనుమంతు అప్పయ్యదొర టెక్కలి వంద పడకల ఏరియా ఆసుపత్రిలో ట్రామాకేర్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. టెక్కలి నియోజకవర్గం పరిధిలో నందిగాం, టెక్కలి, కోటబొమ్మాళి మండలాలను కలుపుతూ 50 కిలోమీటర్లు పైబడి జాతీయరహదారి ఉంది. దీంతో ట్రామాకేర్ ఆవశ్యకత ఏర్పడింది. ఈ ట్రామాకేర్ సెంటర్‌కు ఒక సీఎంవో, ఆర్థోపెడిక్, జనరల్‌సర్జన్, న్యూరాలజీ, ఎనస్తీషియా, సివిల్ అసిస్టెంట్ సర్జన్ వంటి పోస్టులతో పాటు ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో, ఎక్స్‌రే టెక్నీషియన్, ఏఎన్ఎం వంటి 45మంది సిబ్బంది అవసరం. అలాగే ప్రత్యేక ఐసీయూ గది, ప్రత్యేక వార్డు కూడా అవసరం. అయితే టెక్కలి ట్రామాకేర్ సెంటర్‌కు 45 పోస్టులు మంజూరైనా న్యూరాలజీ, ఎనస్తీషియా, జనరల్ సర్జన్ వంటి పోస్టులు అప్పట్లో భర్తీ కాలేదు. కేవలం ఏఎన్ఎంలు, ఎఫ్ఎన్‌వో, ఎంఎన్‌వో, డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులు మాత్రమే భర్తీ అయ్యాయి. ప్రస్తుతం ఇక్కడ ఒక ఎంఎన్‌వో, ఇద్దరు ఎఫ్ఎన్‌వోలు, ఇద్దరు డేటాఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే ఉన్నారు. మిగిలిన పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. కొంతమంది విధుల్లో చేరక, మరికొంతమంది ఇతర ప్రాంతాలకు బదిలీ అయిపోయారు. దీంతో ట్రామాకేర్ సెంటర్ ప్రస్తుతం కోమాలోకి చేరిపోయింది. ఫలితంగా జాతీయరహదారిపై ప్రమాదాలకు గురైన వారికి అవసరమైన వైద్య సేవలు అందించలేని పరిస్థితి నెలకొంది. వారిని శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫరల్ చేస్తున్నారు. ఈ విషయమై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి.సూర్యారావు వద్ద ప్రస్తావించగా 'ట్రామాకేర్‌కు సంబంధించి చాలామంది వైద్యులు, సిబ్బంది విధుల్లో చేరలేదు. ఆ పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. ప్రస్తుతం టెక్కలి ట్రామాకేర్‌లో ఒక ఎంఎన్‌వో, ఇద్దరు ఎఫ్ఎన్‌వోలు, ఇద్దరు డేటాఎంట్రీ ఆపరేటర్లు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని' తెలిపారు.




టెక్కలి జిల్లా కేంద్ర ఆసుపత్రి

ఒంటరి మహిళలే టార్గెట్

(5వ పేజీ తరువాయి)

2020లో కోల్‌కత్తాలో గంజాయి రవాణా చేస్తూ పట్టుబడి నాలుగేళ్ల జైలు శిక్ష అనుభవించి ఈ ఏడాది ఫిబ్రవరిలో విడుదలై స్వగ్రామానికి చేరుకున్నారన్నాడు. తన తల్లి అనారోగ్యానికి చికిత్స నిమిత్తం డబ్బులు అవసరం కావడంతో ఆదే గ్రామానికి చెందిన సంతోష్ ప్రధాన్‌తో ఒంటరి మహిళల మెడ నుంచి బంగారు ఆభరణాలు దొంగతనానికి పథకం వేశారని, వీరికి బిజయ్ ప్రధాన్, సంజయ్ ప్రధాన్ సహకారం అందించడంతో దొంగతనాలకు పాల్పడ్డారని ఎస్పీ తెలిపారు. గతంలో వీరిపై ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సాం, బీహార్ రాష్ట్రాల్లో చైన్ స్నాచింగ్ కేసులు నమోదయ్యాయని అన్నారు. శ్రీకాకుళం జిల్లాలో మొట్టమొదటి సారిగా నేరాలకు పాల్పడినట్లు చెప్పారు. నలుగురు నిందితుల్లో చిన్మయి ప్రధాన్‌ను అరెస్ట్ చేయగా మిగిలిన ముగ్గురి కోసం గాలిస్తున్నట్లు ఎస్పీ చెప్పారు. కాశీబుగ్గలో జరిగిన చోరీకి సంబంధించి సొత్తును రికవరీ చేయాల్సి ఉందన్నారు. నిందితుడిని పట్టుకోవడంలో ప్రతిభ చూపించిన క్రైం ఏఎస్పీ పి.శ్రీనివాసరావు, కాశీబుగ్గ రూరల్ సీఐ ఈశ్వరరావు, సోంపేట సీఐ బి.మంగరాజు, కంచిలి ఎస్ఐ జి.రాజేష్, వజ్రపుకొత్తూరు ఎస్ఐ నిహార్, హెచ్‌సీ గవరయ్య, పీసీలు బషీర్, నీలకంఠం, రాధాకృష్ణ, శ్యామ్, షణ్ముక, ప్రేమ్‌కుమార్‌ను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.



రికవరీ చేసిన బంగారు ఆభరణాలు

సీసీ కెమెరాలతో నిరంతర నిఘా

జిల్లాలో పని చేయని సీసీ కెమెరాల స్థానంలో కొత్తవి అమర్చనున్నామని ఎస్పీ తెలిపారు. జిల్లాలో శివారు ప్రాంతాలు, కోలనీలు, సమస్యాత్మక ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేస్తామన్నారు. అలాగే రోడ్లపై ఉన్న ప్రైవేటు సీసీ కెమెరాలను కూడా కమాండ్ కంట్రోల్ రూమ్‌కి అనుసంధానం చేసి నిఘా పెంచుతామని స్పష్టం చేశారు. మరో 5,6 నెలల్లో జిల్లాలో పూర్తి స్థాయిలో నిఘా నేత్రాలు అందుబాటులో ఉంటాయన్నారు.

శోకసంద్రంలో కుముందానివానిపేట

- ● చికిత్స పొందుతూ దుర్గ మృతి
- ● ముగిసిన తల్లీకుమారుల అంత్యక్రియలు



దుర్గ (ఫైల్)

టెక్కలి/సంతబొమ్మాళి, అక్టోబరు 16 (ఆంధ్ర జ్యోతి): తల్లీకుమారుల మృతితో సంతబొమ్మాళి మండలం కుముందానివానిపేట గ్రామం శోకసంద్రంలో మునిగిపోయింది. సోమవారం రాత్రి గ్రామానికి చెందిన డెక్కల దుర్గ తన ఇద్దరు కుమారులు రుషి, బాలాజీకి కూల్‌డ్రింక్‌లో ఎలుకల మందు కలిపి ఇచ్చి తాను కూడా తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన విషయం తెలిసిందే. ఈ ఘటనలో రుషి, బాలాజీ అదే రోజు మృతి చెందగా, దుర్గ టెక్కలి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం వేకువజామున మృతి చెందింది. ఎలుకల మందు తాగిన దుర్గను చికిత్స కోసం మంగళవారం 108 వాహనంలో టెక్కలి జిల్లా ఆసుపత్రికి తరలించారు. చికిత్స అందించేందుకు వైద్యులు ప్రయత్నించగా ఆమెకు నిరాకరించింది. పలు మార్లు వైద్యసిబ్బంది నచ్చజెప్పినా వినలేదు. దీంతో పరిస్థితి విషమించి బుధవారం దుర్గ మృతి చెందింది. చిన్నారుల మృతదేహాలతో పాటు దుర్గ మృతదేహానికి పోస్టుమార్టం పూర్తయిన తరువాత వారి మృతదేహాలు బుధవారం రాత్రి స్వగ్రామం కుముందానివానిపేటకు చేరుకున్నాయి. దుర్గ భర్త రాజు.. మూడు మృతదేహాలకు తలకొరివి పెట్టాడు. చివరి చూపు చూసేందుకు వచ్చిన గ్రామస్థులు,చుట్టు పక్కల గ్రామాల వారు కన్నీరు పెట్టారు.

బస్సు నుంచి జారిపడిన విద్యార్థి

- ● రహదారిపై విద్యార్థుల ఆందోళన

అమదాలవలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పాలకొండ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న పల్లె వెలుగు బస్సు నుంచి బుధవారం ఓ విద్యార్థి జారిపడడంతో గాయపడ్డాడు. దీంతో విద్యార్థులు ఆందోళనకు దిగారు. ఆర్టీసీ అధికారులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. పాలకొండ నుంచి శ్రీకాకుళం వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రయాణికులతో రద్దీగా ఉండడంతో కళాశాలలకు వెళ్లేందుకు తప్పనిసరి పరిస్థితిలో కొంతమంది విద్యార్థులు ఫుట్‌బోర్డుపై నిలబడి ప్రయాణానికి ఉపక్రమించారు. అయితే, అక్కులపేట-జగ్గుశాస్త్రులపేట మధ్య బస్సు నుంచి ఒక విద్యార్థి జారిపడి రోడ్డుపై పడడంతో గాయపడ్డాడు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ బస్సులో ఉన్న విద్యార్థులతో పాటు వివిధ వాహనాలపై వచ్చిన విద్యార్థులు రోడ్డుపై బైఠాయించారు. సుమారు 40 నిమిషాల పాటు ఇరువైపులా వాహనాల రాకపోకలను అడ్డుకున్నారు.పాలకొండ-శ్రీకాకుళం మధ్య విద్యార్థులకు గతంలో ప్రత్యేక బస్సు ఉండేదని, దాన్ని ఇటీవల ఆర్టీసీ అధికారులు రద్దు చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనివల్ల కళాశాలలు, పాఠశాలలకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ఆర్టీసీ అధికారులు స్పందించి కళాశాలల సమయంలో బస్సులను నడపాలని డిమాండ్ చేశారు. అనంతరం ఆందోళనను విరమించారు.



రోడ్డుపై బైఠాయించిన విద్యార్థులు



గాయపడిన విద్యార్థి

'బీర పువ్వే దేవతామూర్తి

(5వ పేజీ తరువాయి)

రోజు మేళతాళాలతో ఊరేగింపు చేసి, ప్రత్యేక పూజలు చేసిన అనంతరం నెల రోజులపాటు పూజించిన ఆ పాత్రతో మొలకలను, బీర పువ్వును గ్రామ సమీపంలోని చెరువులో నిమజ్జనం చేస్తారు. అలాగే ఆశ్వయుజ మాసం పూర్తయ్యేంత వరకు మాంసాహారం పూర్తిగా మానేస్తారు. ఉల్లితో పాటు బీర కాయను సైతం ఆహారంగా తీసుకోరు. బీర పువ్వును దేవతామూర్తిగా కొలిచే వీరంతా బీర కాయను మాంసాహారంగా భావించి, తినడం మానేయడం విశేషంగా చెప్పవచ్చు. ప్రకృతిలోని మొక్కలను, జంతువులను పూజించడం చూస్తున్న మనకు మొక్కలోని ఓ పువ్వును సైతం దేవతగా కొలిచే ఆచారం ఉండటం, అది నేటి తరం అమ్మాయిలు భక్తిశ్రద్ధలతో పాటిస్తుండటం గమనార్హం.



కొక్కిలిపుట్టుగలో పూజలు చేస్తున్న మహిళలు

సంప్రదాయాన్ని కొనసాగిస్తున్నాం



మా పెద్దలు ఆచరించిన సంప్రదాయాలను మేము కొనసాగిస్తున్నాం. మేము చిన్నప్పుడు ఈపూజలు చేస్తే మంచి భర్త లభిస్తాడని, సంతానం లేని వారు పూజలు చేస్తే పిల్లలు పుడతారని పెద్దలు చెప్పేవారు. ఆ నమ్మకంతో ఈ ఆశ్వయుజ మాసమంతా పూజలు చేస్తాం. మా తరువాతి తరం కూడా ఈ ఆచారాన్ని కొనసాగిస్తుండడం సంతోషంగా ఉంది.

- డాలి బిసాయి, కొక్కిలిపుట్టుగ

ఏటా పూజలు చేస్తున్నాం



మా పెద్దల సంప్రదాయాలను మేము కొనసాగించడం చాలా ఆనందంగా ఉంది. కుటుంబంలోని వారందరూ క్షేమంగా ఉంటారనే విశ్వాసంతో ప్రతీ సంవత్సరం ఈ పూజలు చేస్తున్నాం.

-శిరీష బిసాయి, కొక్కిలిపుట్టుగ

కొనసాగుతున్న టెట్

ఎచ్చెర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఈ నెల 3వ తేదీన ప్రారంభమైన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) కొనసాగుతోంది. శ్రీ వెంకటేశ్వర ఇంజనీరింగ్ కళాశాల (ఎచ్చెర్ల)లో బుధవారం రెండు షిఫ్ట్‌ల్లో కలిపి 200కు 178 మంది హాజరయ్యారు. ఈ నెల 21వ తేదీ వరకు ఈ పరీక్షలు జరగనున్నాయి.

ఉపాధి శిక్షణలో ప్రవేశాలు

ఎచ్చెర్ల, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్లలోని యూనియన్ బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో వివిధ కోర్సుల్లో శిక్షణ తరగతులను వచ్చే నెల 1న ప్రారంభించనున్నట్టు సంస్థ డైరెక్టర్ కె.శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. డ్రోన్ ఆపరేటింగ్, ఫొటో ఎడిటింగ్, వీడియో మిక్సింగ్, ఆల్బమ్ క్రియేషన్, ఎలక్ట్రికల్ హౌస్ వైరింగ్ కోర్సుల్లో శిక్షణ ఇవ్వనున్నట్టు చెప్పారు. 30 రోజుల పాటు నిర్వహించనున్న శిక్షణలో ఉచితంగా భోజన, వసతి సౌకర్యం కల్పించనున్నట్టు చెప్పారు. ఉమ్మడి జిల్లాలోని గ్రామీణ ప్రాంత యువకులు మాత్రమే ఈ కోర్సుల్లో చేరేందుకు అర్హులన్నారు. మరిన్ని వివరాలకు 95534 10809, 77021 80537 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలన్నారు.

20న ఖోఖో జట్ల ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఈ నెల 20వ తేదీన జిల్లాస్థాయి జూనియర్స్ ఖోఖో బాలురు, బాలికల జట్ల ఎంపికలు నిర్వహించనున్నట్టు అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు చిట్టి నాగభూషణరావు, కార్యదర్శి చిట్టి ఫల్గుణరావు తెలియజేశారు. 2006 సెప్టెంబరు 21వ తేదీ తర్వాత జన్మించినవారు అర్హులన్నారు. ఇందులో ఎంపికైన క్రీడాకారులు ఈ నెల 25వ తేదీ నుంచి చిత్తూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు వయస్సు ధ్రువీకరణ పత్రంతోపాటు ఆధార్ కార్డుతో ఎంపికల తేదీ ఉదయం 9 గంటలకు హాజరై ఖోఖో సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ సాధు శ్రీనివాసరావు వద్ద రిపోర్టు చేయాల్సిందిగా కోరారు.

ఎమ్మెల్యే అండతోనే ఇసుక మాఫియా

ఆమదాలవలస, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో ఎమ్మెల్యే అండతోనే వంశధార, నాగావళి నదుల్లో ఇసుకను తోడేస్తున్నారని వైసీపీయువ నాయకుడు తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. ఆమదాలవలసలో తన నివాసంలో బుధవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఇసుక మాఫియాపై రెవెన్యూ, పోలీస్ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని అన్నారు.

డిప్యుటేషన్‌కు అవకాశం ఇవ్వాలి

గుజరాతీపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ఎస్‌సీఈఆర్‌టీలో డిప్యుటేషన్‌పై పని చేసే పోస్టులకు అర్హత కలిగిన మున్సిపల్ ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్.బాబూరావు, బి.శ్రీరామ్మూర్తి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. అధ్యాపక పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ పాఠశాల విద్యాశాఖ జారీ చేసిందని, ఈ డిప్యుటేషన్ పోస్టులకు గవర్నమెంట్, జిల్లా పరిషత్ వారికి మాత్రమే అర్హులని చెప్పడం సరికాదన్నారు. తక్షణమే నోటిఫికేషన్‌లో మున్సిపల్ ఉపాధ్యాయులను కూడా అర్హత కల్పించాలని కోరారు.

సైబర్ నేరాలపై అవగాహన

ఆమదాలవలస, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని డీసీసీబీ సీఈవో డి.వరప్రసాద్ అన్నారు. బుధవారం ఏడో వార్డు చింతాడలో స్వయం సహాయ సభ్యులకు యూనియన్ బ్యాంక్ సౌజన్యంతో ఎస్‌ఎస్‌టీ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతి ఒక్కరూ పొదుపు చేయాలన్నారు. బ్యాంకు నుంచి ఫోన్ చేస్తున్నామని చెప్పి అకౌంట్, ఏటీఎం పిన్ నెంబర్లు అడిగితే చెప్పవద్దన్నారు. ఈ సమావేశంలో డీసీసీ బ్యాంకు మేనేజర్ సంధ్యారాణి, మున్సిపల్ సీవో నాగమణి, జిల్లా డీసీఏ హరనాథ్, సీఎఫ్ఎల్ కోఆర్డినేటర్ వెంకటేష్, రామారావు తదితరులు ఉన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

● 'పల్లె పండుగ'లో ఎమ్మెల్యేలు శంకర్, అశోక్, రవికుమార్ ● సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన

గ్రామాల అభివృద్ధే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాన్ని చేపట్టిందని శ్రీకాకుళం, ఇచ్ఛాపురం, ఆమదాలవలస ఎమ్మెల్యేలు గొండు శంకర్, బెందాళం అశోక్, కూన రవికుమార్ అన్నారు. పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా బుధవారం వివిధ గ్రామాల్లో రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు.



సచివాలయ సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్న ఎమ్మెల్యే కూన రవికుమార్

ప్రజల నమ్మకాన్ని వమ్ముచేయం



శ్రీకాకుళం రూరల్: అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే శంకర్

శ్రీకాకుళం రూరల్/గార, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం రూరల్ మండలం ఇప్పిలి, కనుగులవానిపేట, కుందువానిపేట, బలివాడ గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గొండు శంకర్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలు తమ ప్రభుత్వంపై పెంచుకున్న నమ్మకాన్ని ఒమ్ముచేయకుండా పల్లెల అభివృద్ధికి కృషి చేస్తున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో ఎంపీడీవో, కూటమి నాయకులు వెంకటరమణ, సీర రమణ, మూకళ్ల శ్రీనివాసరావు, జయానంద్, కోనాడ నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. అలాగే గార మండలం బోరవానిపేట, శాలిహుండం, పూసర్లపాడు, అంబళ్లవలస, బూరవెల్లి గ్రామాల్లో నిర్వహించిన పల్లెపండుగలో ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొని సిమెంట్ రోడ్డు, డ్రైనేజీల నిర్మాణానికి భూమి పూజ చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, అధికారులు, పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంతోనే అభివృద్ధి



కంచిలి: బూరగాంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కంచిలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వంతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే బెందాళం అశోక్ అన్నారు. బూరగాం, మండపల్లి, కుత్తుమ, కొక్కిలిపుట్టుగ గ్రామాల్లో పల్లె పండుగలో భాగంగా సీసీ రోడ్లకు కూటమి నాయకులతో కలసి శంకుస్థాపన చేశారు. బూరగాంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, విప్లవవీరుడు అల్లూరి సీతారామరాజు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జనసేన పార్టీ ఇన్‌చార్జి దాసరి రాజు, కూటమి నాయకులు బొడ్డు రాజేశ్వరి, ఇప్పిలి లోలాక్షి, ఎంపీడీవో వి.తిరుమలరావు, తహసీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, ఏపీవో ధనుంజయ, ఏవో ధనుంజయ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ మోహన్, ఈవోపీఆర్డీ ఈశ్వరి తదితరులు పాల్గొన్నారు.

దుష్ప్రచారం మానుకోవాలి

బూర్జ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పనితీరు చూసి ఓర్వలేకే వైసీపీ నాయకులు దుష్ప్రచారం చేస్తున్నారని, ఈ పద్ధతి మానుకోవాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. అన్నంపేట, టీడీఆర్ రాజుపేట, కురువంపేట పల్లె పండగలో భాగంగా సిమెంట్ రహదారులు, డ్రైనేజీల నిర్మాణాలకు బుధవారం శంకుస్థాపన చేశారు. టీడీఆర్ రాజుపేట గ్రామంలో పారిశుధ్య లోపం ఉందని స్థానికులు ఫిర్యాదు చేయడంతో సచివాలయ సిబ్బందిపై ఎమ్మెల్యే ఆగ్రహ వ్యక్తం చేశారు. సచివాలయ సిబ్బంది సమయానికి రావడం లేదని సర్పంచ్ అంబుజాక్షి ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లారు. పద్ధతి మార్చుకోవాలని, సక్రమంగా పనిచేయకపోతే రాజీనామా చేసి వెళ్లిపోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పీరుకట్ల విశ్వప్రసాద్, మార్క్‌ఫెడ్ డైరెక్టర్ ఆనెపు రామకృష్ణంనాయుడు, కూటమి నాయకులు సీతబాబు, చిన్నయ్య, రాజు, శ్రీరామనాయుడు, ఎంపీడీవో తిరుపతిరావు, తహసీల్దార్ పద్మావతి, ఏపీవో రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌లో క్రిమినల్ కేసులపై దృష్టి



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా

గుజరాతీపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): జాతీయ లోక్ అదాలత్‌లో క్రిమినల్ కేసులపై ఎక్కువ దృష్టి సారించాలని జిల్లా న్యాయాధికారి జునైద్ అహ్మద్ మౌలానా అన్నారు. స్థానిక జిల్లా కోర్టు భవనంలో పోలీసు, ఎక్సైజ్ అధికారులతో బుధవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిసెంబరు 14వ తేదీన నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో ఎక్కువ శాతం క్రిమినల్, ఎక్సైజ్ కేసులు రాజీ చేయాలన్నారు. అలాగే జైళ్లలో ముద్దాయిలపై నల్సా అందిస్తున్న సేవలపై చర్చిస్తూ త్వరితగతిన వారికి సాయం అందించే దిశగా లోక్ అదాలత్ కోర్టు పని చేస్తుందన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ మహ్మద్‌ఖాన్, ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి, న్యాయాధికారులు పి.భాస్కరరావు, ఎస్.ఎం.ఫణికుమార్, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు, ప్రిన్సిపల్ సివిల్ న్యాయాధికారి కేఎల్‌వీ హిమబిందు తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు పరిహారం అందించే చర్యలు తీసుకోవాలి

జిల్లా కోర్టు ఆవరణలో హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ స్కీమ్‌పై బుధవారం సమావేశం నిర్వహించారు. సుప్రీం కోర్టు ఆదేశాల మేరకు జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు ఆధ్వర్యంలో ఈ సమావేశం జరిగింది. హిట్ అండ్ రన్ యాక్సిడెంట్ కేసుల్లో బాధితులకు అందించే నష్టపరిహారం విషయంలో తగు చర్యలు తీసుకోవాలని చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులు డీఆర్‌వో ఎం.అప్పారావు, డీఎస్పీ (దిశ) పీఎస్ బి.రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

పలాస ఆర్డీవోకు తీవ్ర అస్వస్థత

● సీటులోనే కుప్పకూలిపోయిన వైనం ● విశాఖపట్నం ఆసుపత్రికి తరలింపు

పలాస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పలాస ఆర్డీవో బి.సుదర్శనదొర తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం మధ్యాహ్నం విధులు నిర్వహిస్తున్న సమయంలో తన సీటులోనే కుప్పకూలిపోయారు. సిబ్బంది ఆయన్ను హుటాహుటిన కాశీబుగ్గలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం విశాఖపట్నంలోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆయన ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. మెదడకు సంబంధించిన వ్యాధితో ఆయన బాధపడుతున్నట్లు తెలుస్తోంది. శ్రీకాకుళంలో డిప్యూటీ కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్న ఆయన ఈ నెల 7న పలాస ఇన్‌చార్జి ఆర్డీవోగా బాధ్యతలు చేపట్టారు. బుధవారం మధ్యాహ్నం ముఖ్య పత్రాలు పరిశీలిస్తున్న సమయంలో తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రి పాలయ్యారు. తహసీల్దార్ కళ్యాణచక్రవర్తి, సిబ్బంది ఆసుపత్రికి చేరుకొని పరిస్థితిపై కలెక్టర్, ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. పని ఒత్తిడి కారణంగా ఆర్డీవో అస్వస్థతకు గురైనట్లు సిబ్బంది చెబుతున్నారు.



ఆర్డీవో సుదర్శనదొరను విశాఖపట్నం ఆసుపత్రికి తరలిస్తున్న సిబ్బంది

పాముతో పిల్లుల చెలగాటం

పలాసరూరల్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బృందావన చంద్ర ఆలయంలో బుధవారం ఓ ఆసక్తికర ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటన అందరినీ ఆకట్టుకుంది. ఓ చిన్న నాగుపాము పడగ విప్పి కనిపించడంతో ఆ ప్రాంతంలో తిరుగుతున్న రెండు పిల్లులు ఒక్కసారి ఆ పాము చుట్టూ చేరాయి. నాగుపాము పడగవిప్పి బుసలు కొడుతుంటే ఆ పిల్లులు దాని మీదకు ఉరకడం కనిపించింది. సుమారు 20 నిమిషాల పాటు ఆ పామును ఎటూ కదలనీయకుండా పిల్లులు దానితో చెలగాటం ఆడాయి. పాము పడగవిప్పి బుసలు కొట్టినా తాము ఏం తక్కువేం కాదంటూ ఆ పిల్లులు కూడా దానిని రెచ్చగొట్టాయి. అయితే చివరకు ఆ పాము కొద్ది దూరం వెళ్లగా పిల్లులు కూడా దానిని అనుసరించాయి. ఆ తరువాత ఓ కన్నంలోకి పాము దూరడంతో కథ సుఖాంతమైంది.



నాగుపాముతో పోరాటం చేస్తున్న పిల్లులు

ఎందుకు నిధులు కేటాయించరు?

● మున్సిపల్ సమావేశంలో కౌన్సిలర్ల నిరసన

ఇచ్ఛాపురం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): తమ వార్డులకు నిధులు కేటాయించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపిస్తూ 8, 5 వార్డుల కౌన్సిలర్లు పల్లంటి మధుమూర్తి, నారాయణ బెహరా సమావేశ మందిరంలో బైఠాయించి నిరసన తెలిపారు. బుధవారం మునిసిపల్ కౌన్సిల్ అత్యవసర సమావేశం చైర్‌పర్సన్ రాజలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. మధుమూర్తి మాట్లాడుతూ.. మా వార్డుకు ఆర్థిక సంఘం నిధులు కేటాయించకపోవడం ఏమిటని అధికారులను నిల దీశారు. మా వార్డు ప్రజలు కూడా పన్నులు కడుతున్నారని, వార్డులో అత్యధికంగా మైనార్టీలున్నారని, అయినా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ప్రశ్నించారు. వార్డులోని మంగళవారం పేట రహదారి నిర్మాణానికి నిధులు అడుగుతున్నానని, అయినా పట్టించుకోవకపోవడం దారుణమన్నారు. అన్ని వార్డులకు సమానంగా నిధులు కేటాయించాలని గతంలో నిర్ణయించినప్పటికీ అమలు చేయడం లేదన్నారు. మంగళవారం పేట రహదారి నిర్మాణానికి రూ.10 లక్షలు కేటాయించాలని, లేకుంటే ఇక్కడి నుంచి కదిలేదని లేదని, కార్యాలయం ఎదుట దీక్ష చేస్తానని హెచ్చరించారు. 15వ ఆర్థిక సంఘం నుంచి రెండో విడత రూ.10 లక్షలు కేటాయిస్తామని చైర్‌పర్సన్ హామీ ఇచ్చారు. దీంతో వ్యవహారం సద్దుమణిగింది. ఐదో వార్డు కౌన్సిలర్ నారాయణ బెహరా కూడా తన వార్డుకు నిధులు కేటాయించలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు.



మునిసిపల్ హాలులో బైఠాయించిన మధుమూర్తి, నారాయణ బెహరా

మహాత్మాగాంధీ స్మారక స్థలిగా అభివృద్ధి చేస్తాం

● రైల్వే జీఎం పరమేశ్వర్

ఆమదాలవలస,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఆమదాలవలస మండలం దూసి రైల్వేస్టేషన్‌ను మహాత్మాగాంధీ స్మారకస్థలికి అభివృద్ధి చేస్తామని ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ పంక్వార్ అన్నారు. బుధవారం ఆయన శ్రీకాకుళం రోడ్డుతోపాటు దూసి రైల్వేస్టేషన్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఇంటాక్ అదనపు కన్వీనర్ వావిలపల్లి జగన్నాథంనాయుడు ఆధ్వర్యంలో శ్రీకాకుళం ప్రతినిధి బృందం దూసి రైల్వేస్టేషన్‌లో రైల్వే జీఎంనపు కలిసి మహాత్మాగాంధీ అడుగు పెట్టిన దూసి రైల్వేస్టేషన్‌ను గాంధీజీ స్మారక స్థలిగా అభివృద్ధి చేయాలని కోరారు. 1942 జూన్ 6న నాటిన మొక్కను, ఆ రోజు గాంధీజీ ప్రసంగించిన స్థలాన్ని జనరల్ మేనేజర్‌కు చూపించారు. స్పందించిన జీఎం దూసి రైల్వేస్టేషన్ మహాత్మాగాంధీ స్మారక స్థలిగా అమలు చేయడానికి చర్యలు చేపట్టాలని డీఆర్‌ఎం సౌరవ్ ప్రసాద్‌ను ఆదేశించారు. జీఎంను కలిసిన వారిలో ఇంటాక్ సీనియర్ మెంబర్లు కొమ్ము రమణమూర్తి, పొన్నాడ రవికుమార్ ఉన్నారు.



జీఎంను కలిసిన రమణమూర్తి, రవికుమార్

పరిసరాలను మెరుగుర్చుకోవాలి

● ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్

పాతపట్నం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): పాఠశాలల ప్రాంగణంలో పరిసరాల పరిశుభ్రత మెరుగుపరచాలని ఐటీడీఏ పీవో యశ్వంత్ కుమార్‌రెడ్డి అన్నారు. మండలపరిధిలోని ఎస్ఎస్ మణుగు, భైదలాపురం గ్రామాల్లోని గిరిజనసంక్షేమ బాలుర ఆశ్రమ పాఠశాలలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల హాజరుపట్టికలను పరిశీలించారు. మెనూ విధిగా పాటించాలని హెచ్‌ఎంలను ఆదేశించారు. దసరా సెలవులకు వెళ్లిన విద్యార్థులందరూ సకాలంలో పాఠశాలకు చేరేలా చొరవచూపాలన్నారు. ఎస్ఎస్‌మణుగులో మధ్యాహ్నబోజనాన్ని పరిశీలించారు. బోధనలతో పెద్దసున్నాపురం గ్రామంలోగల వీడీవీకే (వందనవికాస) కేంద్రాన్ని పరిశీలించారు. అలాగే ఎస్ఎస్ మణుగు, భైదలాపురం గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు.



ఎస్ఎస్ మణుగు ఆశ్రమపాఠశాలను పరిశీలిస్తున్న పీవో యశ్వంత్‌కుమార్ రెడ్డి

రేపు ఎచ్చెర్లలో మినీ జాబ్ మేళా

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో డిగ్రీ నుంచి పీజీ వరకు విద్యార్హత కలిగి 18 నుంచి 30 సంవత్సరాల మధ్య వయసు గల నిరుద్యోగ యువతకు "మినీ జాబ్ మేళా" ఎచ్చెర్ల బీఆర్ అంబేడ్కర్ యూనివర్శిటీ నందు 18వ తేదీ శుక్రవారం నిర్వహిస్తున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి ఉరిటి.సాయికుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఉద్యోగ మేళాలో మిరాకిల్ సాఫ్ట్‌వేర్, టెక్ తమ్మినా సాఫ్ట్‌వేర్ సొల్యూషన్ వంటి 3 స్థానిక, బహుళజాతి కంపెనీలు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నాయన్నారు. ఆసక్తి, అర్హత కలిగిన వారు తమ విద్యార్హత నకలు, ఆధార్ కార్డు నకలు, 3 బయోడేటా పత్రాలు, 2 పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఉదయం 9-30 గంటలకు హాజరవ్వాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9550967353, 9704960160 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

రేపు సర్వసభ్య సమావేశం

రణస్థలం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ పిన్నింటి రజినిసాయి అధ్యక్షతన ఈనెల 18న ఉదయం 11 గంటలకు నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ఎం.ఈశ్వరరావు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

చేపపిల్లల పంపిణీ

కవిటి, అక్టోబరు16(ఆంధ్రజ్యోతి): స్వదేశీ మత్స్యకారులకు చేపపిల్లల పెంపకంతో అభివృద్ధి సాధించాలని ఎమ్మెల్యే బి.అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో బుధవారం స్వదేశీ మత్స్య సహకార సంఘాలకు చేప పిల్లలను పంపిణీ చేశారు. కవిటి, సోంపేట, పలాస, మందస, ఇచ్ఛాపురం మండలాలకు చెందిన స్వదేశీ మత్స్యకారులకు చేశామని మత్స్యశాఖాధికారి కె.రవికుమార్ తెలిపారు. ఎంపీడీవో శ్రీనివాసరెడ్డి, గ్రామ మత్స్యసహాయకులు, సాగరమిత్రలు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ క్షేత్ర సందర్శన

ఆమదాలవలస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): నిమ్మతొర్లాడ గ్రామంలోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాన్ని ఉత్తర ప్రదేశ్ రాష్ట్రం నుంచి వచ్చి అటల్ భూ జల్ బృందం బుధవారం సందర్శించారు. ప్రకృతి వ్యవసాయంలో సాగుచేస్తున్న చెరకు పంటను పరిశీలించారు. ఈ క్షేత్ర సందర్శనకు ప్రకృతి వ్యవసాయ రాష్ట్ర విభాగం నుంచి కృష్ణారావు, రీజనల్ కో-ఆర్డినేటర్ హేమసుందర్ హాజరయ్యారు. చెరకు నుంచి బెల్లం తయారీను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది శివ, శ్రీనివాస్, సూర్యనారాయణ, రమణ, పెంటయ్య, చిరంజీవి పాల్గొన్నారు.

ఇరిగేషన్ అధికారుల పర్యటన

బూర్జ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): అల్లెన పంచాయతీలో ఇరిగేషన్ అధికారులు బుధవారం పర్యటించారు. పంచాయతీలోని రైతులు తమ పంట పొలాలకు సాగునీరు అందడం లేదని, లిఫ్ట్ ఇరిగేషన్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే కూన రవికుమార్ దృష్టికి ఇదివరలో సమస్యను వివరించారు. స్పందించిన ఎమ్మెల్యే.. ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్లడంతో అధికారులు పరిశీలించారు. రైతుల సమస్యలను తెలుసుకున్నారు. ఇరిగేషన్ డీఈ కామరాజు, ఏఈ శ్రీనివాసరావు, సచివాలయ సర్వేయర్ మోహన్, టీడీపీ నాయకులు వావిలపల్లి రామ్‌జీ, వైకుంఠరావు, గోవిందరావు, ఆంజనేయులు, రైతులు ఉన్నారు.

జనసేన పార్టీ జెండా ఆవిష్కరణ

ఇచ్ఛాపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) బూర్జిపాడు పంచాయితీ పెద్ద లక్ష్మీపురంలో పులకల తులసీరావు ఆధ్వర్యంలో జనసేన పార్టీ జెండాను ఆ పార్టీ ఇచ్ఛాపురం ఇన్‌చార్జి దాసరి రాజు, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ తిప్పన దుర్యోధన రెడ్డి బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రాష్ట్ర మత్స్యకార శాఖ కార్యదర్శి నాగుల హరి బెహరా, కర్రి నాగరాజు, జానీ, రెక్కల భాస్కర్, జోగారావు, వల్లభ శేఖర్, పరుశురామ్, యోగి, మధు, తారకేష్, పాపారావు తదితరులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

సోంపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): రానున్న ఖరీఫ్‌లో ధాన్యం కొనుగోలులో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని తహసీల్దార్ అప్పలస్వామి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా పౌరసరఫరాల శాఖ సాంకేతిక సిబ్బంది ఆధ్వర్యంలో రైతు సేవా కేంద్రాల వ్యవసాయ సహాయకులకు శిక్షణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సాంకేతిక సిబ్బంది ధాన్యంలో తేమశాతం కొలిచే యంత్రాలు, నాణ్యతా ప్రమాణాల నిర్ధారణపై శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీవో వెంకటేశ్వరులు, ఏవో బి. నర్సింహమూర్తి, సీఎస్‌డీటీ కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

అసంపూర్తిగా చెత్త సంపద కేంద్రం


తర్లాకోట రోడ్డులో అర్ధంతరంగా నిలిచిన చెత్త సంపద కేంద్రం

పలాస, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): పలాస-కాశీబుగ్గ మునిసిపాలిటీకి సంబంధించి నిర్మాణం చేపట్టిన చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం పూర్తి కాకపోవడంతో నిధులు వృథా అయ్యాయన్న వాదనలు వినిపిస్తున్నాయి. రూ.10 లక్షలతో పనులు చేపట్టినా ఇప్పటి వరకు సంపద సృష్టి ప్రారంభం కాలేదు. దీంతో లక్ష్యానికి తూట్లు పడుతున్నాయి. పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో తర్లాకోట పంచాయతీ కేటీ రోడ్డు పక్కన రెండేళ్ల కిందట వైసీపీ ప్రభుత్వ హయాంలో చెత్త సంపద తయారీ కేంద్ర నిర్మాణం ప్రారంభించారు. మునిసిపల్ స్థలంలో నిర్మించాల్సిన ఈ కేంద్రాన్ని గ్రామీణ మండల పరిధిలో నిర్మించడంపై అప్పట్లో విమర్శలకు దారితీసింది. అయితే అప్పటి ప్రజాప్రతినిధుల ఆదేశాల మేరకు అధికారులు ఆఘమేఘాలపై స్థల సేకరణ చేసి 90 శాతం నిర్మాణం పూర్తి చేశారు. పట్టణ పరిధిలో ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను ఇక్కడికి తీసుకువచ్చి దానితో వర్మీ కంపోస్టు తయారీతో పాటు పనికి వచ్చిన చెత్తను విద్యుత్ తయారీ సంస్థలకు అందించడం ద్వారా మునిసిపాలిటీకి అదనపు ఆదాయం తీసుకురావాలన్నది లక్ష్యం.. ప్రతిపాదన బాగే ఉన్నా అప్పటికే పదికరాల్లో ఉన్న మునిసిపల్ డంపింగ్ యార్డుకు వస్తున్న చెత్తను వదిలేయడం, కొత్తగా ఈ కేంద్రాల ఏర్పాటుపై సర్వత్రా విమర్శలు వచ్చాయి. అలాగే పనులు పూర్తి చేయకపోవడం, చెత్త నుంచి సంపద వృద్ధి కాకపోవడంతో లక్ష్యం నెరవేరలేదు. దీంతో ప్రజాధనం వృథా అయిందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఒకవేళ ఈ కేంద్రాన్ని మునిసిపాలిటీ నిర్వహణకు అవకాశం లేకుంటే తర్లాకోట పంచాయతీకి అప్పగించి వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

జిల్లాలో రోడ్ల నిర్మాణానికి రూ.261 కోట్లు మంజూరు


బెజ్జి వద్ద రోడ్డు నిర్మాణ శిలాఫలకం ఆవిష్కరిస్తున్న కలెక్టర్ పుండ్కర్, ఎమ్మెల్యే రమణమూర్తి

జలుమూరు, (సారవకోట) అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ ప్రాంతాల్లో రోడ్ల నిర్మాణానికి రూ.261 కోట్లు ఉపాధి హామీ పథకంలో మంజూరయ్యాయని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తెలిపారు. అర్లి గ్రామం నుంచి గోవర్ధనపురం వరకు, బెజ్జి నుంచి ముంజువానిపేట గ్రామం వరకు రోడ్ల నిర్మాణానికి బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పల్లె పండుగ కార్యక్రమంలో ఈ పనులకు శంకుస్థాపన చేస్తున్నామన్నారు. పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు స్థానికులు సహకరించాలన్నారు. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ.. బొంతు ఎత్తిపోతల పథకం పనులు అర్ధంతరంగా నిలిచిపోవడంతో సాగునీరందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లారు. దీనిపై స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో చర్చించి తగు చర్యలు తీసుకుంటానన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు, టీడీపీ నేతలు ధర్మాన తేజకుమార్, కత్తిరి వెంకటరమణ, సురవరపు తిరుపతిరావు, టెక్కలి ఆర్డీవో ఎం.కృష్ణమూర్తి, ఎంపీడీవో మోహన్ కుమార్, తహసీల్దార్ విజయలక్ష్మి, ఎంఈవో ఎం.వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్: ఎమ్మెల్యే ఎంజీఆర్


వృద్ధురాలి సమస్యను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గోవిందరావు

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రజలకు సంబంధించిన సమస్యలను పరిష్కారమే ధ్యేయంగా ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నామని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నా రు. బుధవారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ప్రజా దర్బార్ నిర్వహించి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వివిధ సమస్యలపై వచ్చే వినతులను 15 రోజుల్లోగా పరిష్కరించాలని, ఒకవేళ ఏదైనా సమస్య ఉంటే అర్జీదారులకు సమాచారం ఇవ్వాలని పలు శాఖల అధికారులకు సూచించారు. సమస్యల పరిష్కారంలో జవాబుదారీగా వ్యవ హరించాలన్నారు. 15 రోజుల్లోగా సమస్య పరిష్కారం కాకుంటే నేరుగా తన వద్దకు రావాలని అర్జీదారులను కోరారు.ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించి 283 వినతులు వచ్చాయి. వృద్ధుల సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు.

మా గ్రామం పేరు జీపీఎస్‌లో లేక ఇబ్బందులు

చొర్లంగి పంచాయతీ గోలుకుప్ప గ్రామం జీపీఎస్ (ఆన్‌లైన్)లో లేకపోవడంతో వివిధ రకాల ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆ గ్రామానికి చెందిన బిడ్డిక ఆనందరావు పేర్కొన్నారు. ఈ మేరకు ఎమ్మెల్యే గోవిందరావుకు వినతిపత్రం అందించి సమస్యను విన్నవించారు. గ్రామస్థులెవ రైనా వివాహం చేసుకుంటే మ్యారేజ్ సర్టిఫికేట్ రావడం లేదని, అలాగే విద్యార్థులు ఉన్నత చదువులకు అవసరమైన ధ్రువపత్రాలు రాక ఇబ్బందులు ఎదురవుతున్నాయన్నారు. సంక్షేమ పథకాలకు నోచుకోవడం లేదని న్యాయం చేయాలని కోరారు. దీనికి ఎమ్మెల్యే స్పందిస్తూ.. వెంటనే తగు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో పి.శ్రీనివాసరావుకు సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జె.ఈశ్వరమ్మ, వివిధ శాఖల అధికారులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్టడీ అవర్స్‌పై దృష్టి సారించాలి


మాట్లాడుతున్న డీవీఈవో తవిటినాయుడు

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ విద్యార్థుల ఉత్తీర్ణతా శాతం పెంచేలా అధ్యాపకులు కృషి చేయాలని, స్టడీ అవర్స్‌పై దృష్టి సారించాలని డీవీఈవో ఎస్.తవిటినాయుడు అన్నారు. బుధవారం గోవింద పురం (పూండి) ప్రభుత్వ జూని యర్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడుతూ.. ఇంటర్ విద్యావిధానంలో ప్రభుత్వం తీసుకు వచ్చిన మార్పులకు అనుగుణంగా విద్యార్థులు తయారుకావాలన్నారు. త్వరలో అమ్మకు వందనం కార్యక్రమం అమలు చేస్తుందని, అలాగే విద్యార్థులకు నోట్, పాఠ్యపుస్తకాలు, బ్యాగ్‌లను అందించడం జరిగిందని వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ ఏడాది నుంచే ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కళాశాల పని చేస్తుందని, ఈ సమయంలో విద్యార్థులకు స్టడీ అవర్స్ నిర్వహించి పరీక్షలకు సిద్ధం చేయాలన్నారు. రికార్డులను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రమేష్ పట్నాయిక్, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ రమణమూర్తి, అధ్యాపకులు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలు అందించాలి


వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న ఐటీడీఏ పీవో

కొత్తూరు, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రికి వచ్చే రోగులకు సకాలంలో, మెరుగైన వైద్యసేవలు అందించాలని ఐటీడీఏ పీవో సి.యశ్వంత్‌కుమార్ రెడ్డి అన్నారు. బుధవారం కొత్తూరు మండలం కురిగాం పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. మందులు అందుబాటులో ఉంచుకోవాల న్నారు. సీజనల్ వ్యాధులపై అప్ర మత్తంగా ఉండాలన్నారు. కార్యక్ర మంలో వైద్యాధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కొళాయికి కర్రే హెడ్


పైప్‌కు కర్రతో అడ్డుకట్టు వేసిన దృశ్యం

నరసన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక సిద్ధాశ్రమం వద్ద ఏర్పాటు చేసిన కొళాయికి కొన్ని రోజులుగా హెడ్ ఏర్పాటు చేయకపోవడంతో ఓ కర్రతో నీటిని నియంత్రిస్తున్నారు. కొళాయిలకు ప్లాస్టిక్ హెడ్‌లు ఏర్పాటు చేయడంతో కుక్కలు పాడు చేస్తు న్నాయని, దీంతో నీరు వృథా అవుతోందని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పంచాయతీ అధికా రులు స్పందించి ఐరన్ హెడ్‌లను ఏర్పాటు చేసి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం

ఎల్.ఎన్.పేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బాలింతలు, గర్భి ణులు, చిన్నారులు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉండ వచ్చని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. చింతలబడవంజ గ్రామంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అంగన్‌వాడీల ద్వారా అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ బి.శాంతిశ్రీ, ఎంపీడీవో పి.శ్రీ నివాసరావు, కొత్తూరు ఐసీడీఎస్ పీవో విమలకుమారి, నాయకులు సర్పంచ్ వి.లక్ష్మి, నాయకులు వి.ఆనందరావు, సీహెచ్ శ్రీనివాసరావు, కె.కృష్ణమా చారి, వి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పీజీటీ పోస్టుల మంజూరు చేయాలని వినతి

పోలాకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): హిందీభాషా పీజీటీ పోస్టులు మంజూరు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో హిందీపండిట్ల పోస్టుల పెంచాలని, ఎల్పీ సెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని మంత్రులను కోరినట్లు హిందీసేవాసదన్ వ్యవస్థాపకులు, ప్రచారసభ కార్యదర్శి ఎస్.గైబువల్లి తెలిపారు. హిందీ ప్రచార పరీక్షల తీరును బుధవారం పోలాకి తదితర ప్రాంతాల్లో పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. హిందీ పండితుల సమస్యలను పరిష్కరించాలని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, విద్యాశాఖామంత్రి నారా లోకేష్‌లను కోరుతూ వినతిపత్రాలిచ్చామన్నారు.

ప్రభుత్వ భూములు ఆక్రమిస్తే కఠిన చర్యలు

జలుమూరు, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పోరంబోకు భూములు, చెరువు గర్భాలు, గట్లు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ జన్ని రామారావు హెచ్చరించారు. తలతరియా గ్రామంలో సర్వే నెం.29లో గోర్జ పోరంబోకులో గోవిందరావు చేసిన ఆక్రమణలను బుధవారం తొలగించారు. ప్రభుత్వ భూములు ఆక్రమించడం చట్టరీత్యా నేరమన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ కిరణ్, మండల సర్వేయర్ నాగేశ్వరరావు, వీఆర్వోలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీనీలమణిదుర్గ ఆలయ ఆదాయం రూ.4.78 లక్షలు


ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది, భక్తులు

పాతపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): స్థానిక శ్రీనీలమణిదుర్గ ఆలయానికి 15 రోజులకు గాను రూ.478133 ఆదాయం వచ్చినట్లు ఈవో టి.వాసుదేవరావు తెలిపారు. బుధవారం ఆలయంలోని హుండీలను ఏసీ కార్యాలయ ప్రతినిధి జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో లెక్కించారు. కార్యక్రమంలో అర్చకులు, శ్రీవేంకటేశ్వర సేవాసమితి సభ్యులు, దేవాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతిభ చాటిన విద్యార్థులకు అభినందన

పలాసరూరల్,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): బ్రాహ్మణతర్లా జడ్పీ హైస్కూల్ విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాస రచన పోటీలో ప్రతిభ చాటారు. హైదరాబాద్‌కు చెందిన వారధి ఫౌండేషన్ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఆన్‌లైన్‌లో నిర్వహించిన వ్యాసరచన పోటీలో విద్యార్థులు బి.చార్మిల, జి.తనూష, పి.బాలకృష్ణ కన్సోలేషన్ బహుమతి సాధించినట్లు నిర్వాహకులు ప్రకటించారని ఉపాధ్యాయుడు శ్రీనివాసరావు తెలిపారు. విజన్-2047 స్వర్ణాంధ్ర వక్తృత్వ పోటీలో ఎస్.ప్రణతి విజేతగా నిలిచిందన్నారు. విద్యార్థులను హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): గోపాలపెంట ఫీల్డ్ అసిస్టెంట్‌పై వచ్చిన ఫిర్యాదు మేరకు డ్వామా ఏపీడీ లోకేశ్ బుధవారం విచారణ చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్ ఉపాధి పనుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారని గ్రామస్థులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని ఏపీడీ తెలిపారు. కార్యక్రమంలో ఏపీవో యుగంధర్, ఎస్ఐ దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు 'దిక్సూచి' పుస్తకాలు

జలుమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఫిజికల్ సైన్సు ఫోరం తయారు చేసిన దిక్సూచి పుస్తకాలను లింగాలవలస ఉన్నత పాఠశాల హెచ్‌ఎం ఉంగటి అప్పలసూర్యనారాయణ బుధవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ జామ్‌తో అవస్థలు


అంబేడ్కర్ కూడలిలో ట్రాఫిక్‌జామ్ దృశ్యం

టెక్కలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అంబేడ్కర్ కూడలిలో బుధవారం రాత్రి ట్రాఫిక్ జామ్ అయ్యింది. ద్విచక్ర వాహనాలు, ఆటోలు, ఇతర వాహనాలు ఎక్కువగా నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. నౌపడా వైపు, ఇటు కాంప్లెక్స్ వైపు వెళ్లే వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ట్రాఫిక్ నియంత్రణ చర్యలు లేకపోవడం, వాహనాలు సైతం ఇష్టానుసారంగా నడుపుతుండడంతో తరచూ సమస్యలు ఏర్పడుతున్నాయని స్థానికులు వాపోతున్నారు. డీఎస్పీ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఈ కూడలి ఉన్నా ట్రాఫిక్ నియంత్రణకు ఎటువంటి చర్యలు లేవు. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి ఇందిరా గాంధీ కూడలి, అంబేడ్కర్ కూడలి, కాంప్లెక్స్ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా తగుచర్యలు తీసుకోవాలని పట్టణవాసులు కోరుతున్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి

లావేరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి) బుడుమూరు వద్ద జాతీయ రహదారిపై బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెం దారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు బుడుమూరు వద్ద జాతీయ రహదారి డివైడర్‌పై ఉన్న పిచ్చి మొక్కలను తొలగిస్తూ.. ఆ చెత్తను వేసేందుకు రోడ్డు పక్కనే ట్రాక్టర్‌ను నిలిపారు. అదే సమయంలో విశాఖ నుంచి శ్రీకాకుళం వైపు వస్తున్న ట్యాంకర్ ఎదురుగా ఉన్న ట్రాక్టర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్‌పై ఉన్న డ్రైవర్ ఆవల సూరి(45) అక్కడికక్కడే దుర్మరణం చెందారు. మృతుడిది పొందూ రు మండలం నరసాపురం గ్రామం. ఎస్ఐ లక్ష్మణరావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దొంగగా అనుమానించి యువకుడికి దేహశుద్ధి

హరిపురం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): మందస మండలం సొండిపూడి గ్రామంలో ఒక యువకుడిని దొంగగా అనుమానించి స్థానికులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన ఘటన మంగళవారం రాత్రి జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. మంగళవారం రాత్రి బైక్‌పై గ్రామంలోకి వచ్చిన ఓ యువ కుడిని స్థానికులు వివరాలు అడుగ్గా అతడు చెప్పేందుకు నిరాకరించాడు. దీంతో దొంగగా భావించి కరెంటు స్తంభానికి కట్టేసి దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసు లకు సమాచారం అందించడంతో వారు ఘటనా స్థలానికి చేరుకొని యువకుడిని స్టేషన్‌కు తరలించారు. వివరాలు ఆరా తీసి ఇచ్ఛాపురం పట్టణానికి చెందిన వ్యక్తిగా నిర్ధారించి అతడి తల్లి దండ్రులకు పిలిపించి అప్పగించారు. ఎస్ఐ ఖాదర్‌భాషా మాట్లాడుతూ గుర్తుతెలియని వ్యక్తులు కనిపిస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, తొందరపడి ఎలాంటి దాడులకు పాల్పడ వద్దన్నారు. స్థానిక యువత సమనయం పాటించాలని సూచించారు.

32 పశువులు పట్టివేత

కంచిలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): కవిటి నుంచి తునికి బుధవారం అక్రమంగా తరలిస్తున్న 32 పశువులను కంచిలి పోలీసులు పట్టుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. కవిటి మండలం జమేదారుపుట్టుగకి చెందిన దాసరి చంద్రమణి పశువులను ఈ ప్రాంతంలో కొనుగోలు చేసి కబేళాలకు తుని తరలిస్తున్నారు. ఈ సమాచారం అందుకున్న పోలీసులు సోంపేట ఫ్లై ఓవర్ బ్రిడ్జిపై అడ్డుకుని కంటైనర్‌ను సీజ్ చేశారు. దాసరి చంద్రమణితోపాటు డ్రైవర్ అనకాపల్లికి చెందిన కిల్లి సత్యనారాయణను అదుపులోకి తీసుకున్నామన్నారు. పశువులను గోశాలకు తరలిస్తా మన్నారు.

సింగుపురం కూడలిలో..

పాతపట్నం, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): సింగుపురం కూడలిలో బుధవారం వాహనాలు తనిఖీ చేస్తుండగా అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్ఐ బి.లావణ్య తెలిపారు. మండల పరిధి కోదూరు గ్రామానికి చెందిన వ్యక్తి వాహనంపై ఆరు ఎద్దులను ఎటువంటి అనుమతులు లేకుండా మెళియాపుట్టి మండలం అంపురంలో కొనుగోలు చేసి సంతలో అమ్మేందుకు తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశామన్నారు. పట్టుకున్న పశువులను రణస్థలంలోని గోశాలకు పంపినట్లు ఆమె తెలిపారు.

అల్లాడపేటలో ఇరువర్గాలపై కేసు నమోదు

జలుమూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): అల్లాడపేట రామ మందిరం ఎదురుగా ఉన్న విద్యుత్ బల్బు కోసం మంగళవారం రాత్రి అదే గ్రామానికి చెందిన తండ్యాల లక్ష్మణ్, కళ్యాణం సింహాచలం తదితరులు గొడవ పడ్డారు. ఈ ఘటనపై ఇరువర్గాల వారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అశోక్ బాబు తెలిపారు.

హెడ్‌కానిస్టేబుల్ రవీంద్రకు ఎస్పీ పరామర్శ


రవీంద్రరావును పరామర్శిస్తున్న ఎస్పీ

టెక్కలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఇటీవల విజయవాడలో బందోబస్తు నిర్వహి స్తున్న సమయంలో అనారోగ్యానికి గురైన హెడ్ కానిస్టేబుల్ కె.రవీంద్రరావును స్థానిక అయ్యప్ప నగర్‌లో నివాసంలో బుధవారం ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి పరామర్శించి ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీశారు. విజయవాడలో చికిత్స పొంది డిశ్చార్జి అయి తన ఇంటికి రావడంతో ఎస్పీ స్వయంగా పరామర్శించారు. ఎటువంటి సాయం కావాలన్నా శాఖాపరంగా అండగా ఉంటామని ఎస్పీహామీ ఇచ్చి ఆ కుటుం బానికి భరోసా కల్పించారు. రవీంద్రరావుకు మెరుగైన వైద్యం అందించేలా చూడా లని స్థానిక పోలీసు అధికారులకు సూచించారు. ఎస్పీతో పాటు ఏఎస్పీ శ్రీనివాస రావు, సీఐలు ఇమాన్యుయల్ రాజు, విజయ్‌కుమార్, ఏఎస్ఐ చంద్రరావు ఉన్నారు.

కొట్లాటలో 9 మందిపై కేసు

కొత్తూరు, అక్టోబర్ 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సిరుసువాడలో మంగళవారం రాత్రి జరిగిన కొట్లాటలో 9 మందిపై కేసు నమోదు చేసినట్లు పోలీ సులు తెలిపారు. వారు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. గ్రామానికి చెందిన బూరాడ కుమారస్వామికి మద్యం అలవాటు ఉండడంతో భార్య నాగమణితో నిత్యం గొడవలు పడుతుండేవాడు. ఈ క్రమంలో భర్త ఇబ్బంది పెడుతున్నారని గ్రామానికి చెందిన యువకులకు ఆమె తెలుపగా మంగళవారం రాత్రి ఆయన కొత్తూరు నుంచి సిరుసువాడ వెళుతుండగా కొత్త కొత్తూరు గ్రామ సమీపంలో యువకులు అడ్డగించి నీ భార్యను ఎందుకు కొడుతున్నావని అంటూ దెబ్బలు కొట్టి గాయపరిచి చంపేస్తామని హెచ్చరించారు. గాయాలతో ఉన్న కుమారస్వామి చికిత్స నిమిత్తం కొత్తూరు సామాజిక ఆసుపత్రికి తరలించారు. తనపై దాడి చేసి గాయపరిచిన ఘటనపై బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు భార్య నాగమణి, అల్లక జయలక్ష్మి, తరుణ్, కర్రి ప్రభుదాస్‌తో పాటు మరో ఐదుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

బాలికల వసతి గృహాల పరిశీలన


బీసీ బాలికల హాస్టల్‌ను పరిశీలిస్తున్న న్యాయాధికారి హరిప్రియ

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ, ఎస్సీ బాలికల వసతిగృహాలను స్థానిక కోర్టు న్యాయాధికారి హరిప్రియ బుధవారం ఆకస్మికంగా పరిశీలించారు. హాస్టళ్లలో భోజన, మౌలిక వసతులపై విద్యార్థినులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలు, స్టోర్ రూమ్‌లను పరిశీలించి పరిశుభ్రంగా ఉంచిన వార్డెన్లు పద్మ, సూర్యప్రభలను అభినందించారు. బాలికల సంరక్షణపై బాధ్యత వహించాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

ఇసుక రీచ్‌ను పరిశీలించిన ఆర్డీవో

నరసన్నపేట, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): గోపాలపెంటలో ఇసుకరీచ్ ప్రారంభించేందుకు గాను సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో భాగంగా ఆర్డీవో సాయిప్రత్యూష, మైనింగ్ శాఖ అధికారులు ఇసుక రీచ్‌ను బుధవారం పరిశీలించారు. ఇసుక రీచ్ బుధవారం ప్రారంభించాల్సి ఉండగా సాంకేతపరంగా సమస్య ఏర్పడడంతో రెండు, మూడు రోజుల్లో ప్రారంభిస్తామని అధికారులు చెబుతున్నారు. ఆర్డీవోతో పాటు తహసీల్దార్ సత్యనారాయణ తదితరులున్నారు. ఇదిలా ఉండగా పర్యావరణశాఖ నుంచి అనుమతులు వచ్చిన తరువాత రీచ్‌ను ప్రారంభించాలని అధికారులు నిర్ణయించారు. అయితే గోపాలపెంట రీచ్‌లో ఇసుక తవ్వకాల టెండర్లపై గందర గోళం ఏర్పడిందని గుసగుసలు వినిపిస్తున్నాయి.

వృత్తివిద్యా కోర్సులతో ఉజ్వల భవిత

పోలాకి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): వృత్తివిద్యా కోర్సులతో ఉజ్వల భవిత ఉంటుందని ఈదులవలస మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ అన్నారు. బుధవారం ఐటీ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్ శిక్షణ తరగతులను ప్రారంభించారు. దసరా సెలవుల్లో వృత్తివిద్యా కోర్సుల విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో వృత్తివిద్యా ఉపాధ్యాయుడు కె.రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

టెక్కలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక 11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ వార్షిక మరమ్మతుల నేపథ్యంలో గురువారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో డివిజన్ ఈఈ జి.శంకరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నేప థ్యంలో తెంబూరు రోడ్డు, గవర్నమెంట్ ఆసుపత్రి ఏరియా, ఎన్టీఆర్ కాలనీ, శ్రీనివాస్‌నగర్, గ్యాస్ గొడౌన్, సబ్ కలెక్టర్ కార్యాలయం, పాత ప్రభుత్వ ఆసుపత్రి తదితర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరిం చాలని కోరారు.

20న విశాఖలో గద్దర్ స్మారక సభ

టెక్కలి, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రజా యుద్ధనౌక గద్దర్ స్మారక సభ ఈనెల 20న విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహిస్తున్నట్లు బహుజన నాయకులు బోకర నారాయణరావు, చల్లా రామారావు తెలిపారు. దీనికి సంబంధించి పోస్టర్లను బుధవారం అంబేడ్కర్ విగ్రహం వద్ద ఆవిష్కరించారు. ఈ సభకు వెన్నెల గద్దర్ హాజరవుతున్నారని, ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు ఉదయ భాస్కర్, సుంకు గోపీనాథ్, లోకనాథం, రాహుల్, శ్రీను, మాధవరావు పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణ పనులకు మార్కింగ్

టెక్కలి, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): స్థానిక అయ్యప్పనగర్ పరిధిలో 40 అడుగుల రోడ్డు విస్తరణ పనులు బుధవారం ప్రారంభించారు. దీనికి సంబంధించిన మార్కింగ్ ప్రక్రియను పీఆర్ అధికారులు చేపట్టారు. ఈ పనులకు సోమవారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు శంకుస్థాపన చేసిన సంగతి తెలిసిందే. పాత జాతీయరహదారి నుంచి కొత్త జాతీయ రహ దారికి సుమారు రూ.1.80 కోట్లతో రోడ్డు విస్తరణ పనులు చేపట్టనున్నారు.

తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలి

నందిగాం, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వరి పంటకు సోకుతున్న తెగుళ్లపై అప్రమత్తంగా ఉండాలని వ్యవసాయాధి కారి పి.శ్రీకాంత్‌వర్మ అన్నారు. బుధవారం కొత్తగ్రహారం, వేణుగోపాలపురం గ్రామాల్లో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులకు పలు సూచనలు చేశారు. సస్యరక్షణ పద్ధతులను వివరించారు. తెగుళ్ల నివారణకు మందుల పిచికారీలో జాగ్రత్తలు తీసుకోవాలని, మధ్యాహ్నం వేళ మాత్రమే పిచికారీ చేయాలని సూచించారు.

రబీలో ఆరుతడి పంటలు వేయాలి

నరసన్నపేట, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): వరి కంకి పాలుపోసుకునే దశలో సుడిదోమ ఆశించే అవకాశం ఉందని అందువల్ల అప్రమత్తంగా ఉండాలని ఏవో సునీత అన్నారు. బుధవారం తామరాపల్లిలో పొలం పిలుస్తోంది నిర్వహించారు.పంట పొలాలను పరిశీలించి తగు సూచనలను అందించారు. వచ్చే రబీలో ఆరుతడి పంటలు వేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏవో పోగోటి శిరీష తదితరులు పాల్గొన్నారు.

కాశీబుగ్గ రూరల్ సీఐగా తిరుపతిరావు



వజ్రపుకొత్తూరు, అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): కాశీబుగ్గ రూరల్ సీఐగా ఎం.తిరుపతిరావు బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వజ్రపుకొత్తూరు, మందస మండలాలకు సీఐగా వ్యవహరిస్తారు. ఇప్పటివరకు సీఐగా వ్యవహరించిన ఈశ్వర రావు విశాఖపట్నం బదిలీ కాగా ఆయన స్థానంలో తిరుమతిరావు విశాఖ నుంచి వచ్చారు. ఈయనకు వజ్రపుకొత్తూరు ఎస్.నిహాల్, ఏఎస్ఐ జున్నారావు, సిబ్బంది పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికి అభినందించారు.

ఇఫ్టూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయండి

కాశీబుగ్గ, అక్టోబరు 16(ఆంధ్రజ్యోతి): నాలుగు లేబర్ కోడ్‌లు, మూడు నేర చట్టాల రద్దు, కేంద్ర ప్రభుత్వ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ విజయవాడలో శుక్రవారం జరగనున్న ఇఫ్టూ రాష్ట్ర సదస్సును విజయవంతం చేయాలని సంఘం జిల్లా కమిటీ నాయకులు పి.మల్లేశ్వరరావు, బి.గోపి కోరారు. ఈ మేరకు బుధవారం బస్టాండ్‌లో సదస్సు పోస్టర్లను ఆవిష్కరించారు. జీడి కార్మికులకు ఈఎస్ఐ, కార్మిక పిల్లలకు ఉచిత విద్య, బీమాలపై ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాలన్నారు. కార్యక్రమంలో నేతలు బాలకృష్ణ, బైరాగి, వల్లభరావు, పాపారావు, సుబుద్ధి, మురళి తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి

మందస,అక్టోబరు 16 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ రఘువర్మ అన్నారు. ఆయన బుధవారం మందసలో పర్యటించి ఉపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. 117 జీవో రద్దు, కామన్ సర్వీసు రూల్స్ అమలు, నూతన పీఆర్సీ అమలు, కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం టైమ్ స్కేల్ అమలుకు కృషి చేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో పలువురు సంఘ నాయకులు, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.